సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
గురువారం, 10.09.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 311
పేజీలు: 08 వెల: రూ. 5

## చాట్ జీపీటీ 6

**ఉద్యోగాలన్నీ ఉఫ్..**

- ఆఫీస్ పనుల నుంచి సైబర్ సెక్యూరిటీ వరకు.. అన్నీ ఏఐ చేతుల్లోకే!
- స్టూడెంట్స్‌కు కొత్త టెక్ సవాల్..
- జీపీటీ-6తో చదువులోనూ మార్పులు

02




# కాంగ్రెస్ ట్రాప్‌లో బీఆర్ఎస్

### కాంగ్రెస్ 'దళిత వ్యూహం'.. బీఆర్ఎస్ డిఫెన్స్!

- కాంగ్రెస్ మైండ్‌గేమ్ సక్సెస్
- వెయ్యి రోజుల ప్రభుత్వ వైఫల్యాలపై చార్జ్‌షీట్‌తో వచ్చిన గులాబీ దళం..
- రెండు రోజుల అసెంబ్లీ సమావేశాల్లో నరేటివ్ మార్చేసిన కాంగ్రెస్..

## అరెస్టులు, కేసులు, క్షమాపణలతోనే బీఆర్ఎస్ సతమతం



**ముద్ర డెస్క్:**
తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు రెండు రోజుల పాటు ప్రజా సమస్యల చర్చ కంటే రాజకీయ హైవోల్టేజ్‌కు వేదికగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. ఆరు గ్యారెంటీల అమలు, ఎన్నికల హామీల వైఫల్యాలను ఎండగడుతూ ప్రభుత్వాన్ని శాసన సభ వేదికగా నిలదీయాలని బీఆర్ఎస్ పక్కా వ్యూహంతో రంగంలోకి దిగింది. కేటీఆర్, హరీశ్‌రావుల నాయకత్వంలో నల్ల చొక్కాలు ధరించి, ప్లకార్డులతో అసెంబ్లీ గేటు వద్దకు చేరుకున్న గులాబీ నేతలు.. ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో పోరాటానికి సిద్ధమయ్యారు. అయితే.. బీఆర్ఎస్ ఆశించిన రాజకీయ మైలేజ్ కాస్తా ఊహించని మలుపులో ఆవిరైపోయింది. అసెంబ్లీ గేటు వద్ద భద్రతా ఆంక్షలు, నెట్టివేతలు, తోపులాటలు చోటుచేసుకోవడంతో తొలుత నిరసనకు ప్రచారం లభించినా.. ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపణలు ఎదురైన వ్యాఖ్యలు మొత్తం రాజకీయ సమీకరణాన్ని మార్చేశాయి.

**ఒక్క వ్యాఖ్యతో మారిన నరేటివ్**
పోలీసులతో వాగ్వాదం సందర్భంగా తాతా మధు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడారంటూ వీడియో క్లిప్‌లతో కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది. దీంతో బీఆర్ఎస్ తెరపైకి తెచ్చిన 'వెయ్యి రోజుల ప్రభుత్వ వైఫల్యాలు' అనే ప్రధాన అంశం వెనక్కి వెళ్లిపోయింది. స్పీకర్ సభలో కన్నీటి పర్యంతం కావడం, కాంగ్రెస్ నేతలు దళిత ఆత్మగౌరవ అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో రాజకీయ నరేటివ్ ఒక్కసారిగా మారిపోయింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్.. తమ నేతల వ్యాఖ్యలపై వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితిలో పడింది.

**రెండో రోజూ అదే సీన్**
రెండో రోజు పరిణామాలు మరింత ఉద్రిక్తంగా మారాయి. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్సీ తాతా మధు, నవీన్ రెడ్డిలను పోలీసులు వారి నివాసాల వద్ద అరెస్ట్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు కావడం రాజకీయంగా మరింత వేడిని పెంచింది. కేటీఆర్, హరీశ్‌రావులపై కూడా కేసులు నమోదయ్యాయి. మరోవైపు తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ కాంగ్రెస్ డిమాండ్ చేయడంతో బీఆర్ఎస్ నాయకత్వం మరింత రక్షణాత్మక ధోరణిలోకి వెళ్లాల్సి వచ్చింది. మిగతా 02లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు

### అసెంబ్లీలో మరోసారి హైడ్రామా..

- చావుడప్పుపై 'కారు' పార్టీ సభ్యుల నిరసన
- సస్పెండ్ చేయాలంటూ మంత్రి శ్రీధర్ బాబు తీర్మానం
- శాసనమండలిలోనూ 'గులాబీ' వాకౌట్
- స్పీకర్ ఛాంబర్ వద్ద ఉద్రిక్తత
- మార్షల్స్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాగ్వాదం



**ముద్ర, హైదరాబాద్:**
అసెంబ్లీ ప్రాంగణంలో వరుసగా చోటుచేసుకున్న ఘర్షణలు, నిరసనల నేపథ్యంలో శాసనసభలో తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. సభా హుందాతనాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించారని, అధికారుల విధులకు ఆటంకం కలిగించారని పేర్కొంటూ సభ ముగిసే వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ప్రశాంత్, సబితా, సునీతారెడ్డి, కో లక్షి , మాధవరం, మాణిక్‌రావు, చింత, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సంజయ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, అనిల్ యాదవ్, గంగుల కమలాకర్‌తో సహా బీఆర్ఎస్ సభ్యులందరినీ ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.
ఈ సస్పెన్షన్ నిర్ణయం వెలువడిన సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభ బయట ఉన్నారు. ఆ సమాచారం తెలుసుకున్న వెంటనే ఆయన అసెంబ్లీ లోపలికి చేరుకున్నారు. అనంతరం సస్పెన్షన్‌కు గురైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ తమ నిరసనను వ్యక్తం చేసేందుకు, పరిణామాలపై వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను కలవడానికి బయలుదేరారు. అయితే, స్పీకర్ ఛాంబర్ వైపు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ మార్షల్స్ దారిలోనే అడ్డుకున్నారు. స్పీకర్ ఛాంబర్ ముందు మార్షల్స్ వారిని నిలిపివేయడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మార్షల్స్ చర్యను నిరసిస్తూ ఎమ్మెల్యేలు అక్కడే తమ ఆందోళనను వ్యక్తం చేయడంతో అసెంబ్లీ ప్రాంగణంలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

### మార్చిలోపు భూ సమస్యలకు చెక్

**56 లక్షల మందికి పట్టాదారు పాస్‌బుక్‌లు**



- ప్రజల వద్దకే పాలన.. ఏపీ సీఎం చంద్రబాబు
- భూములకు భద్రతే కూటమి సర్కార్ లక్ష్యం
- అత్యాధునిక టెక్నాలజీతో కొత్త పాస్‌బుక్‌లు

02

### బీజేపీకి డబ్బులే డబ్బులు

**బీజేపీ ఖజానాకు భారీ నిధులు**

02



- ఎన్నికల వేళ రూ.1,473 కోట్ల విరాళాలు
- కాంగ్రెస్ కంటే 7 రెట్లు అధికం
- రూ.904 కోట్లకు పైగా పెరిగిన బ్యాలెన్స్

### కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కుట్రలు

**బీఆర్ఎస్‌కు సామాజిక బహిష్కరణ తప్పదు**



- దళితుల అవమానంపై రేవంత్ ఆగ్రహం
- విజయ్ కుమార్‌తో సమగ్ర దర్యాప్తు
- బీఆర్ఎస్‌పై సీఎం ఆగ్రహం

02

## తెలంగాణలో ఎమర్జెన్సీ పాలన

### మాపై దాడి చేసి.. మాపైనే కేసులు పెట్టారు

- అసెంబ్లీ ఘటనలపై లోక్‌భవన్‌కు బీఆర్ఎస్
- కాంగ్రెస్ పాలనపై గవర్నర్‌కు ఫిర్యాదు

02



### మహిళా స్వేచ్ఛకు పెళ్లి ముగింపు కాదు

**భార్య అంగీకారం కీలకం**

**వైవాహిక అత్యాచారంపై సుప్రీం కీలక విచారణ**



- భార్య సమ్మతి లేకుండా భర్త లైంగిక చర్యపై చర్చ
- మహిళ వ్యక్తిగత స్వయంప్రతిపత్తికి పెళ్లి అడ్డంకి కాదు
- సుప్రీం త్రిసభ్య ధర్మాసనం కామెంట్స్

02

### జర్నలిస్టులకు ఆరోగ్యపథకం హామీ నెరవేర్చండి

**టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ**



- ఎనిమిదేళ్లుగా జెహెచ్ఎస్‌కు బ్రేక్
- అక్రిడిటేషన్ కార్డులపై అధికారుల తీరును ఖండించిన టీయూడబ్ల్యూజే
- అక్రమ కేసులు ఉపసంహరించాలి

03

## తెలుగు రాష్ట్రాలపై వరాల జల్లు

### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు




- తెలంగాణకు నాలుగో రైల్వే లేన్
- ఏపీలో రైల్వే నెట్‌వర్క్ విస్తరణ
- రూ.2,419 కోట్లతో భారీ పనులు
- రైల్వే కారిడార్లకు మహర్దశ
- మోదీ సర్కార్ కీలక గ్రీన్ సిగ్నల్

**ముద్ర, ఢిల్లీ:**
ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ భేటీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, అశ్వినీ వైష్ణవ్ తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా రైల్వే కారిడార్లలో నాలుగు లేన్ల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యంగా దక్షిణాదిలోని తెలంగాణ, ఏపీ తమిళనాడు, కర్ణాటక పరిధిలో 5, ఉత్తరాదిలో 3 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులను చేపట్టనున్నారు. గత పన్నెండేళ్లుగా కొనసాగుతున్న రైల్వే ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఈ కీలక ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. ప్రధాని మోడీ నేతృత్వంలో రైల్వే శాఖను పూర్తిగా మిగతా 02లో

### ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 10.09.2026
www.mudranews.in | @mudranews



## మునగాకు పొడి..



మునగాకు పొడిని సమతుల ఆహారం, వ్యాయామంతో కలిపి తీసుకుంటే బరువు నియంత్రణకు సహాయపడొచ్చు. ఇది ఒక్కటే కొవ్వును కరిగించే మాయా పదార్థం కాదు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కుట్రలు..

**ముద్ర, హైదరాబాద్ :**
శాసనసభ వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై, మాజీ సీఎం కేసీఆర్‌పై విరుచుకుపడ్డారు. దేశంలో అణచివేత, దోపిడీ పెరిగిన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీ ప్రజల స్వేచ్ఛ, రాజ్యాంగ పరిరక్షణకు నిలబడిందని గుర్తుచేశారు. శాసనసభ సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి ప్రభుత్వంపై కుట్రలు పన్నుతూ, చివరికి దళిత సమాజ తీవ్ర అవమానానికి కారణమైన బీఆర్ఎస్ అధినేతను, ఆయన పార్టీని ప్రజలే సామాజికంగా బహిష్కరించాలని సీఎం పిలుపునిచ్చారు.

**అసెంబ్లీలో కుట్రలకు ఫామ్‌హౌస్ కేంద్రం**
సభలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అప్పులపై నిజాలు బయటకు వస్తాయనే భయంతోనే కేసీఆర్ తన ఎమ్మెల్యేలను ఉసిగొల్పారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. శాసనసభ ప్రారంభానికి ముందు రోజు రాత్రి ఫామ్‌హౌస్‌లో సమావేశమై, సభను ఏ విధంగా అడ్డుకోవాలో పథకం రచించారని మండిపడ్డారు. దేశంపై దాడి చేసిన ఉగ్రవాదులకు, సభలో స్పీకర్ స్థానాన్ని, అధికారులను ఉన్మాదంతో అవమానించిన బీఆర్ఎస్ నేతలకు ఏమాత్రం వ్యత్యాసం లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**దళితులను అవమానిస్తే సహించేది లేదు**
ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద దళితులు నిరసన తెలిపి వచ్చిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడంపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే తమ పార్టీ నేతలు ఈ శుద్ధీకరణకు పాల్పడ్డారని ఆ రోజే స్పష్టమైందన్నారు. సమాజాన్ని దొరలు, దళితులు అని రెండుగా విభజించే నైజం కేసీఆర్‌దని విమర్శించారు. నేలను కాదు, బీఆర్ఎస్ నేతల మనస్సుల్లో ఉన్న కుల అహంకారాన్ని, కుళ్లును యాసిడ్‌తో శుద్ధి చేయాలని ఆక్రోశం వెళ్లగక్కారు.

**ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం**
ఈ వరుస పరిణామాలపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని, కుట్రలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని సీఎం స్పష్టం చేశారు. ఈ ఘటనలపై సమగ్ర దర్యాప్తు కోసం అధికారి విజయ్ కుమార్‌ను నియమిస్తున్నట్లు సభలో ప్రకటించారు. గత కొన్ని రోజులుగా జరిగిన కుట్రలు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, శాంతిభద్రతల సమస్యలు, విధుల్లో ఉన్న పోలీసులపై జరిగిన దాడులన్నింటిపై పూర్తిస్థాయి విచారణ జరుగుతుందని చెప్పారు.

**స్పీకర్‌కు అండగా ఉంటాం**
అసెంబ్లీ స్పీకర్ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన వారిని ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించదని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కొంతమందికి కోర్టుల నుంచి బెయిల్ రావచ్చు కానీ, ప్రజల మనస్సుల్లో వారి పాపాలు ఎప్పటికీ చెరిగిపోవని అన్నారు. నిజాం రాజునైనా మట్టికరిపించిన తెలంగాణ గడ్డపై ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్రలు చేసేవారిని ఉప్పుపాతర వేయడం ఖాయమని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# తెలుగు రాష్ట్రాలపై వరాల జల్లు

(మొదటి పేజీ తరువాయి)
ప్రక్షాళన చేసి ఆధునీకరిస్తున్నట్లుగా కేబినెట్ భేటీ అనంతరం కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. భవిష్యత్తులో అత్యధిక రద్దీని తట్టుకునేలా ఏడు హై-డెన్సిటీ రైల్వే కారిడార్లతో పాటు మరికొన్ని మార్గాల్లో నాలుగు లేన్లు, క్వాడ్రుప్లింగ్ పనులను చేపట్టనున్నట్లుగా ఆయన తెలిపారు.

**ఏపీలో రూపుదిద్దుకోనున్న ప్రాజెక్టులు**
కేంద్ర కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయాలతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రైల్వే మార్గాలకు ఊతం లభించనుంది. ఇందులో భాగంగా హౌరా-చెన్నై కారిడార్‌లో విశాఖపట్నం, విజయవాడ మీదుగా నాలుగు లేన్ల రైల్వే నెట్‌వర్క్ పనులకు కేంద్రం ఒకే చెప్పింది. అదేవిధంగా ముంబై-చెన్నై రైల్వే కారిడార్‌లో భాగంగా గుంతకల్లు, రేణిగుంట మీదుగా నాలుగు లేన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాకపోకలు సాగించే రైళ్లకు మెరుగైన సౌకర్యం కలగనుంది. అయితే, దేశవ్యాప్తంగా రద్దీగా ఉండే కీలక మార్గాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ప్రయాణికుల రద్దీకి తగినట్లుగా మౌలిక వసతులను కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాబోయే కాలంలో రద్దీ విపరీతంగా పెరిగే కారిడార్లను ముందే గుర్తించి ఈ నాలుగు లేన్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

**తెలంగాణలోనూ..**
తెలంగాణలోని ఘట్‌కేసర్-కాజీపేట్ మధ్య నాలుగో లేన్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ. 2,419 కోట్లతో ఘట్‌కేసర్-కాజీపేట్ మధ్య 110 కిలోమీటర్ల మేర ఈ నాలుగో లేన్ నిర్మాణం జరగనుంది. అదేవిధంగా అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 3, 4 లేన్ల నిర్మాణానికి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మొత్తం 77 కిలోమీటర్ల పొడవుతో ఈ పనులను చేపట్టనున్నారు.



# మహిళ స్వేచ్ఛకు పెళ్లి ముగింపు కాదు

**ముద్ర ఢిల్లీ :**
వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. పెళ్లి అయినంత మాత్రాన మహిళల వ్యక్తిగత స్వయంప్రతిపత్తి, స్వేచ్ఛ అంతం కారాదని అత్యున్నత త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. భార్య అంగీకారం లేకుండా భర్త లైంగిక సంబంధం కలిగి ఉండే చర్యను అత్యాచారంగా పరిగణించకుండా చట్టంలో ఉన్న మినహాయింపును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఇవాళ కోర్టు విచారణ చేపట్టింది.



**ప్రత్యేక ధర్మాసనం విచారణ..**
భారత ప్రధాన జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జాయ్‌మల్య బాగ్చి, జస్టిస్ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. ఈ వివాదానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తన అఫిడవిట్ దాఖలు చేసిందని, అన్ని పక్షాల వాదనల సారాంశాన్ని ఒకే దగ్గర కలిపి తయారు చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ వ్యాజ్యాలపై ప్రతి బుధవారం, గురువారాల్లో తుది విచారణ చేపట్టనున్నట్లుగా ధర్మాసనం వెల్లడించింది.

**కేంద్ర ప్రభుత్వం వాదనలు ఇలా..**
భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 375, కొత్తగా వచ్చిన భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 63 ప్రకారం.. 18 ఏళ్లు నిండిన భార్యతో భర్త జరిపే లైంగిక చర్యలు అత్యాచారం కిందకు రావనే మినహాయింపు ఉంది. ఈ మినహాయింపును తొలగిస్తే వివాహ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని, కుటుంబ, సామాజిక సంబంధాలు చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉందని కేంద్ర ప్రభుత్వం గతంలోనే కోర్టుకు తెలిపింది. కేవలం చట్టపరమైన కోణంలో కాకుండా సమగ్రమైన, సామాజిక దృక్పథంతో ఈ అంశాన్ని పరిశీలించాలని కేంద్రం కోరింది.

**ఢిల్లీ హైకోర్టు నుంచి ..**
వైవాహిక అత్యాచార మినహాయింపు అంశంపై ఢిల్లీ హైకోర్టులో భిన్నాభిప్రాయాలు వెలువడ్డాయి ఓ బెంచ్ సభ్యుడు ఈ నిబంధన రాజ్యాంగ విరుద్ధమని తేల్చగా, మరో సభ్యుడు ఇది సమర్థనీయమని అభిప్రాయపడ్డారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఖుష్బూ సైఫీతో పాటు ఆర్ఐటీ ఫౌండేషన్, ఆలిండియా డెమోక్రటిక్ విమెన్స్ అసోసియేషన్ తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరోవైపు కర్ణాటక హైకోర్టులోనూ ఇదే అంశానికి సంబంధించి రిషిష్ సాహూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగి, వైవాహిక మినహాయింపులను హైకోర్టు తప్పు పట్టింది. ఈ అన్ని అప్పీళ్లను, పిటిషన్లను ప్రస్తుతం సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారిస్తోంది.



# తెలంగాణలో ఎమర్జెన్సీ పాలన

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణలో ఎమర్జెన్సీ వాతావరణం నెలకొందని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం తీవ్ర ముప్పులో పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ శాసనసభ వేదికగా చెలరేగిన రాజకీయ ఉద్రిక్తతలు రాజ్‌భవన్ (లోక్ భవన్)కు చేరాయి. సభ ముగిసే వరకు సస్పెన్షన్‌కు గురైన బీఆర్ఎస్ శాసనసభ్యులు చట్టసభలు, పోలీసుల తీరుపై గవర్నర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో 10 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం బుధవారం (సెప్టెంబర్ 9) మధ్యాహ్నం లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఈ సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో చోటు చేసుకున్న వరుస పరిణామాలను వివరిస్తూ 13 పేజీల సమగ్ర ఫిర్యాదు లేఖను గవర్నర్‌కు అందజేశారు.

అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లోక్ భవన్‌లో మాట్లాడారు. “రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపించేలా పాలన కొనసాగుతుంది. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. వెయ్యి రోజుల పాలన వైఫల్యాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. యూరియా కొరత, రైతు భీమాపై విషయాలను ప్రస్తావించాం. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యపై గవర్నర్‌కు కంప్లెంట్ ఇచ్చాం. రాహుల్ గాంధీ నల్ల టీ షర్ట్స్ వేసుకున్నట్టే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలము బ్లాక్ టీ షర్ట్స్ వేసుకున్నాం. బ్లాక్ టీ షర్ట్స్‌తో అసెంబ్లీకి వెళ్తుంటే మమ్మల్ని పోలీసులు అడ్డుకున్నారు. మాజీ హోంశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మగ పోలీసులు గొంతు పట్టుకున్నారు. మాజీ మంత్రి సునీతారెడ్డి చీర పట్టుకొని లాగారు. మాపై దాడి చేసి మా పైనే ఉల్టా కేసులు పెడుతున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ చావు కోరుకున్నారు. వేముల వీరేశం, కుంభం అనిల్ రెడ్డి, నర్సారెడ్డి ఎర్రవల్లి ఫాం హౌస్ దగ్గరకు వచ్చారు. వేల మంది కాంగ్రెస్ గూండాలను ఎర్రవల్లి ఫాం హౌస్‌పై దాడి చేసేందుకు ఉసిగోల్పారు. మేము అనని మాటలను అన్నట్టు స్పీకర్‌కు ఆపాదించారు. దళిత స్పీకర్ అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే స్పీకర్‌ను అవమానిస్తున్నారు. శాసనసభ కాదు దుష్యాసన సభలా మార్చారు. చావు డప్పు ఎప్పుడు కొడుతారో.. మనందరికీ తెలుసు. ఎర్రవల్లి ఫాం హౌస్ దగ్గర చావు డప్పు కొట్టారు. అసెంబ్లీ బయట జరిగిన ఘటనపై సీఎస్, డీజీపీని పిలిపించి మాట్లాడుతానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు మంచివి కాదని గవర్నర్ మాతో చెప్పారు.” అని కేటీఆర్ వివరించారు.

# కాంగ్రెస్ ట్రాప్ లో బీఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

**రేవంత్‌పై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలతో మరింత డ్యామేజ్**
ఈ మొత్తం వ్యవహారంలో సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన తీవ్ర వ్యాఖ్యలు కూడా బీఆర్ఎస్‌కు రాజకీయంగా కలిసి రాలేదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రత్యర్థిని రెచ్చగొట్టే ప్రయత్నంలో తాము మరింత ఆవేశానికి లోనైతే.. అది చివరకు ప్రత్యర్థికే ఆయుధంగా మారుతుందనే పరిస్థితి కనిపించింది. తాతా మధు వ్యాఖ్యలతో మొదలైన వివాదం నుంచి దృష్టిని మరల్చే క్రమంలో కేటీఆర్ కూడా తీవ్ర పదజాలంతో స్పందించడంతో.. అసలు అంశమైన ప్రభుత్వ వైఫల్యాలపై చర్చ వెనక్కి వెళ్లింది.

**కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలూ.. బీఆర్ఎస్‌కు మిస్‌డ్ ఛాన్స్?**
ఇదే సమయంలో షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. కేసీఆర్‌ను ఉద్దేశించి చేసినట్లు ఆరోపణలు ఎదురైన తీవ్ర వ్యాఖ్యలు కూడా రాజకీయ దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలను ప్రజాక్షేత్రంలో పెద్ద అంశంగా మలచుకుని సానుభూతి పొందే అవకాశం బీఆర్ఎస్‌కు ఉన్నప్పటికీ.. ఆ అవకాశాన్ని పార్టీ పూర్తిస్థాయిలో ఉపయోగించుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేటీఆర్, ఇతర నేతలు ఆవేశానికి బదులు ప్రజాస్వామ్యబద్ధమైన శైలిలో స్పందించి ఉంటే.. కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ప్రజల సానుభూతి బీఆర్ఎస్ వైపు మరింతగా మళ్లే అవకాశం ఉండేదన్న వాదన వినిపిస్తోంది.

**కాంగ్రెస్ ‘ట్రాప్’లో చిక్కుకున్న గులాబీ దళం?**
రెండు రోజుల అసెంబ్లీ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే.. బీఆర్ఎస్ ముందుగా అనుకున్న రాజకీయ అజెండా పూర్తిగా పక్కదారి పట్టినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన, ఆరు గ్యారెంటీల అమలు, ఎన్నికల హామీల వైఫల్యాలపై ప్రజల్లో చర్చకు తెరలేపాలని భావించిన ప్రతిపక్షం.. చివరకు అరెస్టులు, కేసులు, క్షమాపణలు, వివరణల చుట్టూనే తిరగాల్సి వచ్చింది. ‘ప్రభుత్వ వైఫల్యాలపై చార్జ్‌షీట్’తో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్‌ను.. ‘సభా సంప్రదాయాలు–దళిత ఆత్మగౌరవం’ అనే అంశంతో కాంగ్రెస్ డిఫెన్స్‌లోకి నెట్టిందా? అన్నదే ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. రాజకీయ పోరులో ప్రత్యర్థిని ఆవేశానికి గురిచేసి తప్పు చేయించడం ఒక వ్యూహమైతే.. ఈ రెండు రోజుల పరిణామాల్లో కాంగ్రెస్ వ్యూహం ఫలించిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ మాత్రం తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశాలను కోల్పోయి.. అనూహ్యంగా ఆత్మరక్షణలో పడిపోయిందనే అభిప్రాయం బలపడుతోంది.

# చాట్ జీపీటీ 6

**ముద్ర డెస్క్ :**
ఓపెన్‌ఏఐ ఇప్పటికే ఏఐ రంగంలో సంచలన మార్పులకు శ్రీకారం చుట్టింది. తాజాగా మరింత శక్తివంతమైన ఏఐ మోడల్ ‘జీపీటీ 6 అస్త్ర’ను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. కంప్యూటర్ వినియోగం, కార్యాలయ పనులు, సైన్స్, కోడింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాల్లో ఈ మోడల్ స్వయంగా అనేక పనులు చేయగలదని సమాచారం.ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేయడం, క్యాలెండర్ ఆధారంగా పనులు నిర్వహించడం, సమాచారాన్ని వెతికి విశ్లేషించడం, వెబ్‌సైట్లు రూపొందించడం, సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేసి పరిశీలించడం వంటి పనులను ఇది చేయగలదు. అంతేకాకుండా బ్లెండర్ సాఫ్ట్‌వేర్‌తో 3డీ మోడల్స్, ప్రజెంటేషన్లు, లీగల్ డాక్యుమెంట్లు, ట్యాక్స్ రిటర్న్స్ వంటి వాటిని కూడా రూపొందించగలదని చెబుతున్నారు. సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లోనూ ఈ మోడల్ అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు సమాచారం. అయితే ఇంతటి శక్తివంతమైన టెక్నాలజీని దుర్వినియోగం చేసే అవకాశాలు ఉండటంతో ఓపెన్‌ఏఐ కఠినమైన భద్రతా నియంత్రణలను అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఈ టెక్నాలజీ విస్తృతంగా అందుబాటులోకి వస్తే ఉద్యోగాలపై ప్రభావం పెరిగే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు ఏఐ ప్రభావం ఎక్కువగా ఇంటర్ లెవెల్ ఉద్యోగాలపై కనిపించగా, భవిష్యత్తులో ఇతర స్థాయి ఉద్యోగాలు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. కొత్త వ్యాపారాలు, శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలకు మరింత ఊతమివ్వొచ్చని నిపుణులు భావిస్తున్నారు.

# మార్చిలోపు భూ సమస్యలకు చెక్

**ముద్ర, అమరావతి :**
వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలో భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పరిధి మాచవరంలో ‘మీ భూమి – మీ హక్కు’ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. గతంలో రెవెన్యూశాఖలో డబ్బులు ఇవ్వకపోతే పని జరగదు అనే అపవాదు ఉంది. ఆ అపవాదును మార్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. అన్ని సమస్యలు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. గత ప్రభుత్వంలో నేరాలు ఘోరాలు చేశారు. భూములకు భద్రత ఇవ్వడమే కూటమి ప్రభుత్వం అజెండా. పటిష్టంగా రీసర్వే చేసి.. అత్యుత్తమ టెక్నాలజీతో పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఇచ్చే పట్టాదారు పాస్‌పుస్తకాలు ఎవరూ మార్చలేరు. ఇప్పటివరకు 36 లక్షల మందికి పాస్ బుక్‌లు ఇచ్చాం.. వచ్చే మార్చి లోపు 56 లక్షల మందికి అందజేస్తాం. పాలన అంటే సచివాలయంలో ఉండటం కాదు. ప్రజల వద్దకు వచ్చి కష్టసుఖాలు తెలుసుకొని పాలసీలు తెచ్చి న్యాయం చేయాలి. ఓటు వేసి గెలిపించిన ప్రజలతో మాట్లాడేందుకే నా పర్యటనలు. పేదల సేవలో పునీతమయ్యేందుకు సూపర్ సిక్స్ సహా సంక్షేమ పథకాలు. ప్రజలంతా గౌరవప్రదంగా జీవించే వరకూ ప్రభుత్వం అండగా ఉంటుంది. పీ4 పథకం తెచ్చి పేదలను ఆదుకునే కార్యక్రమం చేపట్టాం. పిల్లలే సంపద.. పిల్లలు లేకపోతే యంత్రాలకు సేవ చేయాల్సి వస్తుంది.

విలువలతో కూడిన రాజకీయం చేయాలనే ఆలోచనతో ఫ్యామిలీ బిజినెస్ ఏర్పాటు చేశా. మూడేళ్ల క్రితం ఇదే రోజు నంద్యాలలో మీటింగ్ నుంచి వస్తుంటే అరెస్ట్ చేశారు. ఏ కేసులో అరెస్టు చేస్తున్నారని అడిగితే చెప్పలేదు. 53 రోజులు రాజమహేంద్రవరం జైలులో ఉన్నాను. నేను జైలులో ఉన్నప్పుడు పవన్ కల్యాణ్ వస్తే ఇబ్బంది పెట్టారు. ఇబ్బందులను ఎదుర్కొని నన్ను కలిశారు. కోనసీమ అంటే బాలయోగి గుర్తుకు వస్తారు. ప్రజల జీవితాలు బాగుపడాలనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. నాలుగో శనివారం వస్తే పేదల ఆరోగ్యం గుర్తుకు వస్తుంది. గత ప్రభుత్వం ప్రజల జీవన విధానాన్ని అస్తవ్యస్థం చేసింది'' అని సీఎం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు వాసంశెట్టి సుభాష్ తదితరులు పాల్గొన్నారు. రైతులకు సీఎం చేతులమీదుగా పట్టాదారు పాస్ బుక్‌లు అందజేశారు.

# బీజేపీకి డబ్బులే డబ్బులు

**ముద్ర, న్యూఢిల్లీ:**
ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కు భారీగా విరాళాలు వెల్లువెత్తాయి. ఎన్నికల సంఘానికి పార్టీ సమర్పించిన ఖర్చుల నివేదిక ప్రకారం.. ఎన్నికల కాలంలో బీజేపీ కేంద్ర ప్రధాన కార్యాలయానికి ఏకంగా రూ.1,472.8 కోట్ల విరాళాలు అందాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ కేంద్ర, రాష్ట్ర యూనిట్లకు కలిపి నికరంగా రూ.207.17 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. దీంతో కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీకి వచ్చిన విరాళాలు ఏడు రెట్లకు పైగా ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది.



**ఎన్నికల సమయంలో పెరిగిన బ్యాలెన్స్**
అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 15 నుంచి మే 6 మధ్య పార్టీల ఆదాయ, వ్యయ వివరాలు వెలుగులోకి వచ్చాయి. మార్చి 15న బీజేపీ కేంద్ర కార్యాలయ ఖాతాలో రూ.6,722.6 కోట్ల క్లోజింగ్ బ్యాలెన్స్ ఉండగా.. మే 6 నాటికి అది రూ.7,627.2 కోట్లకు చేరింది. అంటే ఎన్నికల సమయంలోనే పార్టీ ఖాతాలో రూ.904.6 కోట్ల మేర పెరుగుదల నమోదైంది. మరోవైపు కేరళ, పశ్చిమ బెంగాల్ ఎన్నికలకు సంబంధించిన బీజేపీ పూర్తి ఖర్చుల నివేదికలు ఇంకా బహిరంగం కాలేదు. అవి వెల్లడైతే పార్టీ మొత్తం ఆదాయం, వ్యయాల లెక్కలు మరింత పెరిగే అవకాశం ఉంది.

**బీజేపీ ఖర్చు రూ.159.7 కోట్లు**
అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ ఇప్పటివరకు సుమారు రూ.159.7 కోట్లు ఖర్చు చేసినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇందులో రూ.130.4 కోట్లు సాధారణ పార్టీ ప్రచారానికి వెచ్చించగా.. మిగిలిన మొత్తాన్ని అభ్యర్థులు, ఇతర ఎన్నికల అవసరాలకు ఖర్చు చేశారు. అస్సాంలో బీజేపీ అత్యధికంగా రూ.96.27 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో సాధారణ ప్రచారానికి రూ.76.73 కోట్లు, అభ్యర్థుల కోసం రూ.19.54 కోట్లు వెచ్చించింది. ప్రకటనలకు సుమారు రూ.37 కోట్లు, స్టార్ క్యాంపైనర్ల ప్రయాణాలకు రూ.27.3 కోట్లు ఖర్చయ్యాయి. తమిళనాడులో రూ.51.56 కోట్లు ఖర్చు కాగా.. రూ.44.51 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.7.05 కోట్లు అభ్యర్థుల కోసం కేటాయించారు. మీడియా ప్రకటనలకు రూ.23.96 కోట్లు, స్టార్ క్యాంపైనర్ల ప్రయాణాలకు రూ.10.04 కోట్లు, ప్రచార సామగ్రికి రూ.5.85 కోట్లు ఖర్చయ్యాయి. పుదుచ్చేరిలో బీజేపీ రూ.11.90 కోట్లు ఖర్చు చేసింది.

**కాంగ్రెస్ ఖర్చు రూ.248.55 కోట్లు**
ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మొత్తం రూ.248.55 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.143 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.105.55 కోట్లు అభ్యర్థుల కోసం వెచ్చించింది. కేరళలో అత్యధికంగా రూ.59.28 కోట్లు ఖర్చు చేయగా.. అసోంలో రూ.22.62 కోట్లు చేసింది. కాంగ్రెస్ కేంద్ర ప్రధాన కార్యాలయం ఐదు రాష్ట్రాల్లో సాధారణ ప్రచారం కోసం రూ.40.52 కోట్లు ఖర్చు చేయగా.. ఆయా రాష్ట్రాల పార్టీ యూనిట్లు మరో రూ.102.49 కోట్లు వెచ్చించాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నిధులు రూ.169.06 కోట్ల నుంచి రూ.103.2 కోట్లకు తగ్గిపోయాయి. దీంతో ఆ పార్టీకి సుమారు రూ.65.86 కోట్ల లోటు ఏర్పడింది. భారీ విరాళాలతో బీజేపీ ఎన్నికల ఖజానా మరింత బలపడగా.. ఖర్చుల విషయంలో కాంగ్రెస్ ఆచితూచి వ్యవహరించినట్లు ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 10.09.2026
www.mudranews.in | @mudranews



## మునగాకు పొడి.. జీర్ణక్రియకు మేలు

మునగాకు పొడిలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి తోడ్పడి, మలబద్ధకం సమస్యను తగ్గించడంలో సహకరించవచ్చు.



## ఏపీలో డీమార్ట్‌కు పోటీగా 'మీ మార్ట్'

**ముద్ర, అమరావతి:** డీమార్ట్ కు పోటీగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'మీ మార్ట్'లను ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,000 మీ మార్ట్ లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇప్పటికే 870 షాపులు సిద్ధం కాగా, మిగిలిన 130 షాపుల పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. అక్టోబర్ 1న సీఎం చంద్రబాబు వీటిని ప్రారంభించనున్నారు. తొలుత 64 రకాల నిత్యావసర వస్తువులను తక్కువ ధరకే అందించనున్నారు. నాణ్యమైన సరుకులను సరసమైన ధరలకు అందించేందుకు నేషనల్ కో–ఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్ సహకారం తీసుకోనున్నారు.

## ఫేక్, ఏఐ చిత్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు**



**ముద్ర, హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో మార్ఫింగ్, ఏఐ జనరేటెడ్ చిత్రాలు, తప్పుడు ప్రచార కంటెంట్‌ను వ్యాప్తి చేస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ చారి డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఫేక్ కంటెంట్‌ను గుర్తించి సైబర్ ఫోరెన్సిక్ దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటన నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపించారు. సంబంధిత డిజిటల్ ఆధారాలు, ఖాతాల వివరాలు, యూఆర్ఎల్స్, టైమ్‌స్టాంప్‌లను భద్రపరచాలని డీజీపీని కోరారు.

## విద్యార్థులకు నైతిక విలువల బోధన తప్పనిసరి

**ముద్ర, అమరావతి :** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నైతిక విలువల తరగతులను తప్పనిసరి చేయాలని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. 16–18 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాపై ఆంక్షలు విధించాలని, పాఠశాల ప్రాంగణాల్లో సెల్‌ఫోన్ వినియోగాన్ని నిషేధించాలని అన్నారు. సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల విద్వేషాలు, వ్యక్తిగత దూషణలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవం సందర్భంగా మీడియా మిత్రులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల సాధికారతతోనే 'వికసిత భారత్ 2047' లక్ష్యం సాకారం అవుతుందని పేర్కొన్నారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలు ఉండాలి తప్ప వ్యక్తిగత దూషణలకు తావివ్వకూడదని సూచించారు.

## తెలంగాణ బియ్యం ఎగుమతుల విస్తరణకు సానుకూల స్పందన

**ముద్ర, హైదరాబాద్** : డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ సమ్మిట్'కు హాజరుకావాల్సిందిగా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను పెంచడం, వ్యవసాయ వాణిజ్య సంబంధాలను విస్తరించడంపై చర్చించారు. తెలంగాణ బియ్యంతో పాటు నాణ్యమైన మాంస ఉత్పత్తులు, విత్తనాల కొనుగోలుపైనా ఫిలిప్పీన్స్ ఆసక్తి చూపినట్లు మంత్రి తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు.

## కేసీఆర్ నిండు నూరేళ్లు జీవించాలి: భట్టి

**ముద్ర, హైదరాబాద్:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శాసనసభలో సభ్యులు సంయమనం పాటించి సభా మర్యాదలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండి రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలకు సేవలు అందించాలని ప్రభుత్వం, సభ కోరుకుంటున్నాయని స్పష్టం చేశారు. సభ సజావుగా సాగేందుకు సభ్యులందరూ సహకరించాలని భట్టి కోరారు.

## బీఆర్ఎస్‌పై దళిత నేతల తీవ్ర విమర్శలు

**ముద్ర, హైదరాబాద్:** కేసీఆర్ నివాసం వద్ద దళిత సంఘాలు నిర్వహించిన 'చావు డప్పు' కార్యక్రమం నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, విప్‌లు బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. దళిత సంఘాల నిరసన అనంతరం ఆ ప్రాంతాన్ని పసుపు నీటితో శుద్ధి చేయడం దళితులను అవమానించడమేనని ఆరోపించారు. ఎమ్మెల్సీ, విప్ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీగా మారిందని, ఈ ఘటనపై కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ, విప్ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే వేముల వీరేశం సైతం కేసీఆర్ తీరుపై మండిపడ్డారు. దళితులను అవమానించే చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, నాయిని రాజేందర్‌రెడ్డి కూడా బీఆర్ఎస్ నేతల తీరును తప్పుబట్టారు. అసెంబ్లీ ఘటనలు, పోలీసులపై అనుచిత ప్రవర్తన, దళితుల పట్ల వ్యవహరించిన తీరుపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై దళిత సమాజం ప్రశ్నించాలని, బీఆర్ఎస్ తీరుకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

## ఎర్రవల్లి ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం



**ముద్ర, హైదరాబాద్ :** ఎర్రవల్లి వద్ద దళితులు డప్పులు కొడుతూ నిరసన తెలిపిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. దళితులు నిరసన తెలిపిన ప్రదేశాన్ని శుద్ధి చేయడం వారిని, యావత్ సమాజాన్ని అవమానించడమేనని అన్నారు. నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, డప్పు కొట్టడం దళితుల సంప్రదాయ వృత్తిలో భాగమని పేర్కొన్నారు. ఈ ఘటన ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు తలవంపు తెచ్చేలా ఉందని, శాసన మండలి దీనిపై విచారం వ్యక్తం చేసి బాధ్యులు తమ తప్పును సరిదిద్దుకోవాలని పొన్నం ప్రభాకర్ కోరారు.

# జర్నలిస్టుల ఆరోగ్య పథకం హామీని నెరవేర్చండి









**- ఎనిమిదేళ్లుగా జేహెచ్ఎస్‌కు బ్రేక్**
**- అక్రెడిటేషన్ కార్డులపై అధికారుల తీరును ఖండించిన TUWJ**
**- జర్నలిస్టులపై అక్రమ కేసులు ఉపసంహరించాలి**
**-TUWJ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ**

**ముద్ర, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా, ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇచ్చిన ఆరోగ్య పథకం హామీని ఇంతవరకు నెరవేర్చకపోవడం విచారకరమని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని అమలు చేసి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ కోరారు. బుధవారం నాడు ఆదిలాబాద్ పట్టణంలోని తరంగిణి ఫంక్షన్ హాలులో జరిగిన, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఆదిలాబాద్ జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

రాష్ట్రంలో ఎనిమిదేళ్లుగా జేహెచ్ఎస్ పథకం అమలుకాకపోవడంతో అనారోగ్యాలకు గురవుతున్న జర్నలిస్టులు చికిత్స కోసం పడుతున్న తిప్పలు వర్ణనాతీతమని విరాహత్ అలీ ఆందోళన వ్యక్తం చేసారు. కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందే ఆర్థిక స్థోమత లేక, ఇప్పటికే వందల సంఖ్యలో జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆయన విచారం వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని తాము పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, ఎలాంటి ఫలితం మాత్రం లేదన్నారు. ఇప్పటికైనా ఆరోగ్య పథకాన్ని అమలుచేసి జర్నలిస్టుల ప్రాణాలకు భరోసా కల్పించాలని ఆయన కోరారు.

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో, జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల మంజూరీలో కలెక్టర్లు తిరకాసులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే అలాంటి వైఖరికి స్వస్తి పలికి కార్డులను మంజూరీ చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జర్నలిస్టుల పట్ల వ్యవహరిస్తున్న వైఖరిని ఆయన ఖండించారు. జిల్లాలో 15మంది జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా, వారికి మంజూరు అయిన అక్రెడిటేషన్ కార్డులను లాక్కోవడం సహించరానిదన్నారు. వెంటనే అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. అలాగే జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అక్రెడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న జర్నలిస్టులపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో విచారణ జరిపించడం సహించరానిదని విరాహత్ ఆందోళన వ్యక్తం చేసారు. ఈ ఇద్దరు అధికారుల వైఖరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన స్పష్టం చేసారు.

జర్నలిజం వృత్తి పట్ల సమాజంలో విశ్వాసం సన్నగిల్లుతున్న నేటి పరిస్థితుల్లో, పవిత్రమైన మీడియా వృత్తికి పూర్వ వైభవం దక్కించేందుకు గాను నైతిక విలువలతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉంటుందని ఆయన సూచించారు. ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా ఆదిలాబాద్ జిల్లాలో తమ సంఘం ఎంతో బలోపేతంగా ఉందని, అయితే సభ్యుల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా జిల్లా నూతన కమిటీ చిత్తశుద్ధితో సేవలందించాలని ఆయన సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్, ప్రకాష్ రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం నాయకుడు హన్మంత్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, కార్యదర్శి దేవేందర్ లతో పాటు జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న దాదాపు 200 మంది జర్నలిస్టులు హాజరయ్యారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కొండా సురేఖ మాజీ ఓఎస్డీకి బిగ్ రిలీఫ్.. ముందస్తు బెయిల్



**ముద్ర, హైదరాబాద్** : మాజీ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌కు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. సుమంత్‌తో పాటు మరో ముగ్గురికి కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన ముందస్తు బెయిల్ ఇచ్చిన న్యాయస్థానం.. ఒక్కొక్కరు రూ.25 వేల చొప్పున రెండు వ్యక్తిగత పూచీకత్తు బాండ్లు సమర్పించాలని ఆదేశించింది. షూరిటీలను సమర్పించిన అనంతరం ముందస్తు బెయిల్‌పై విడుదల చేయాలని దర్యాప్తు అధికారిని ఆదేశించింది.

**పోలీసుల ముందు సరెండర్ కావాలి**

ముందస్తు బెయిల్ పొందిన నిందితులు పోలీసుల ముందు సరెండర్ కావాలని కోర్టు సూచించింది. కేసు దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు అధికారి అవసరమైనప్పుడు పిలిస్తే తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించింది. కేసు దర్యాప్తును ప్రభావితం చేసే ఎలాంటి చర్యలకు పాల్పడకూడదని కోర్టు స్పష్టం చేసింది. ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ సాక్షులను ప్రేరేపించడం, బెదిరించడం చేయకూడదని ఆదేశించింది. సాక్ష్యాలను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేయకూడదని పేర్కొంది.

## కాళోజీ జయంతి - తెలంగాణ భాషా దినోత్సవం శుభాకాంక్షలు

**తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**



**ముద్ర హైదరాబాద్ :** తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు సేవలను చిరస్మరణీయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి సేవలు మనమంతా స్మరించుకోవాలన్నారు. ప్రజల గొంతుకగా నిలిచిన కాళోజీ స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రజా ప్రభుత్వం సారథ్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ భాషకు కాళోజీ చేసిన సేవలు శ్లాఘనీయమని... ఆయన స్ఫూర్తితో తెలంగాణ భాష, సాహిత్యానికి మరింత ప్రోత్సాహం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వం స్పష్టం చేశారు.

## కంటోన్మెంట్‌లో పేదల ఉపాధిని పునరుద్ధరించాలి

**- ఎంపీ ఈటల రాజేందర్**



ముద్ర, హైదరాబాద్: కంటోన్మెంట్‌లో చిరు వ్యాపారుల ఉపాధిని దెబ్బతీయవద్దని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అధికారులను హెచ్చరించారు. కంటోన్మెంట్ సీఈఓ అభివృద్ధి నిరోధకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వారం రోజుల్లో పేదలకు తిరిగి ఉపాధి కల్పించకపోతే తానే స్వయంగా రంగంలోకి దిగాల్సి వస్తుందని స్పష్టం చేశారు.కంటోన్మెంట్ నిధులతో ఎస్‌బీఐ కాలనీ, చందులాల్ బౌలి, జయనగర్ కాలనీల్లో రూ.59 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు ఈటల శంకుస్థాపన చేశారు. కేంద్రం నుంచి సుమారు రూ.18 కోట్ల నిధులు తీసుకురావడానికి కృషి చేసినట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవకులనే విషయాన్ని మర్చిపోవద్దని, పేదల జీవనోపాధిని దెబ్బతీయడం సహించరాదని అన్నారు.

ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసన సభ్యులు ఎన్. శ్రీ గణేష్, కంటోన్మెంట్ బోర్డు మెంబెర్ నర్మద మల్లికార్జున్, సీనియర్ నాయకులు బిన్ శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాణిక్ రెడ్డి, కంటోన్మెంట్ కన్వీనర్ విజయానంద్, వార్డ్ 6 ప్రెసిడెంట్ ప్రతిక్, సీనియర్ నాయకులు పిట్ల నగేష్, విజయ్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగిసిన తెలంగాణ టెట్ పరీక్ష..

**89.96 శాతం మంది హాజరు..**

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇన్–సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (TGTET–Inservice Teachers–2026) కంప్యూటర్ ఆధారిత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పాఠశాల విద్య శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో మొత్తం మూడు సెషన్లలో ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. ఈ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24,986 మంది ఇన్–సర్వీస్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 22,477 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం మీద 89.96 శాతం మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్లు అధికారులు వెల్లడించారు. వివిధ కారణాల వల్ల 2,509 మంది ఉపాధ్యాయులు పరీక్షకు గైర్హాజరయ్యారని విద్యాశాఖ పేర్కొంది. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్షలు పూర్తి కావడంతో అభ్యర్థులు ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. విద్యాశాఖ షెడ్యూల్ ప్రకారం.. సెప్టెంబర్ 15, 2026న అధికారిక వెబ్‌సైట్‌లో 'ప్రాథమిక కీ' ని విడుదల చేయనున్నారు. అభ్యర్థులు తమ సమాధానాలను ఈ కీ ద్వారా సరిచూసుకోవచ్చు.

ప్రాథమిక కీ పై ఏవైనా అభ్యంతరాలు లేదా ప్రశ్నలపై సందేహాలు ఉంటే, వాటిని నమోదు చేసుకోవడానికి విద్యాశాఖ అవకాశం కల్పించింది. సెప్టెంబర్ 15 నుంచి సెప్టెంబర్ 17 వరకు ఆన్‌లైన్ విధానంలో తమ అభ్యంతరాలను ఆధారాలతో సహా సమర్పించవచ్చు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత వచ్చిన అభ్యంతరాలను స్వీకరించబోమని అధికారులు స్పష్టం చేశారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది కీ, అలాగే ఫలితాలను త్వరలోనే ప్రకటిస్తారు. అభ్యర్థులు పూర్తి వివరాలు, అభ్యంతరాల నమోదు కోసం అధికారిక వెబ్‌సైట్ https://www.schooledu.telangana.gov.in ను సందర్శించవచ్చు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 10.09.2026
www.mudranews.in
@mudranews
mudratv
4 వేదిక
Peoples Voice
మీ 'ముద్ర' వేయండి
నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com




# ధనవంతుల పెట్టుబడులు



చాలామంది డబ్బులు సంపాదిస్తారు. కానీ వాటిని రెట్టింపు చేయడంలో తడబడుతూ ఉంటారు. ఒక మధ్య తరగతి వ్యక్తి తనకు వచ్చిన ఆదాయంలో మిగిలిన దానిని బ్యాంకులో డిపాజిట్ చేసి.. దానిపై వచ్చే కొంత వాటితో సంతృప్తి పడతాడు. కానీ ఒక ధనవంతుడితో సమానంగా డబ్బులు సంపాదించలేడు. ఎందుకంటే ధనవంతుల ఆలోచనలు వేరే విధంగా ఉంటాయి. సాధారణంగా ధనవంతులు ఎలాంటి పెట్టుబడులు పెడతారో తెలుసా..? వారు మాత్రమే అత్యధిక ధనవంతులుగా ఎందుకు మారుతున్నారో తెలుసా?

మనకు వచ్చిన సంపాదనలో ఖర్చులు పోనూ కచ్చితంగా పొదుపు చేయాలి. అలా ఇప్పుడు పొదుపు చేస్తేనే భవిష్యత్తులో అత్యవసరాలు లేదా ఇతర అవసరాలకు డబ్బు అందుబాటులో ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు వచ్చే ఆదాయం భవిష్యత్తులో వచ్చే అవకాశాలు ఉండవు. ఇలాంటప్పుడు వడ్డీ రూపంలో లేదా రెంటల్ రూపంలో డబ్బులు వచ్చే మార్గాలను వెతుక్కోవాలి. అందుకోసం ప్లాట్ బిజినెస్ చాలా అనుకూలంగా ఉంటుంది.

గతంలో సినీ పరిశ్రమకు చెందిన చాలామంది రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టారు. వారు ఇప్పుడు అనుకున్న సినిమాలు చేయలేకపోయినా.. ఆ ఫ్లాట్ల ద్వారా అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. అసలు ఇలా ప్లాట్ ద్వారా ఎలా ఆదాయాన్ని పొందవచ్చు? ఎందుకు ఫ్లాట్ ద్వారా ఆదాయం వస్తుంది?

ఉదాహరణకు ఒక వ్యక్తి హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నాడని అనుకుందాం. అతనికి వచ్చే ఆదాయంలో పొదుపు చేయాలని అనుకుంటే.. సాధారణ డిపాజిట్లు లేదా.. బ్యాంకు సేవింగ్కు బదులు హైదరాబాద్ కు సమీప దూరంగా ఉన్నా ఫ్లాట్స్ కొనుగోలు చేయవచ్చు. ఈ ఫ్లాట్స్ భవిష్యత్తులో డిమాండ్ ను పొందే అవకాశాలు ఉంటాయి. ఎందుకంటే నగరం విస్తీర్ణం రోజు రోజుకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకప్పుడు వ్యవసాయ క్షేత్రాలు.. పల్లెటూరి వాతావరణన్ని కల్పించిన కోకాపేట ఇప్పుడు రిచెస్ట్ ఏరియాగా మారిపోయింది. అలాగే హైదరాబాద్ చుట్టుపక్కల కూడా మరింతగా అభివృద్ధి చెంది అవకాశం ఉంటుంది.

ఇవే కాకుండా హైదరాబాద్ నగరంలోని కొన్ని షాపింగ్ కాంప్లెక్స్ లో షట్టర్స్ లేదా ఫ్లాట్స్ ను విక్రయిస్తూ ఉంటారు. అయితే ఈ షెటర్స్ లేదా ప్లాట్స్ ను లోన్ ద్వారా కూడా కొనుగోలు చేయవచ్చు. వీటి ద్వారా నెల నెల రెంటు వస్తూ ఉంటుంది. వచ్చిన రెంటుతో కాస్త డబ్బులు కలిపి లోన్ పూర్తి చేస్తే భవిష్యత్తులో ఆ శేఖర్ మిగిలిన అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో దీనిని విక్రయించినా కావలసిన డబ్బులు పొందవచ్చు.

ఈ విధంగా ప్లాట్స్ లేదా సిటీలోని షెటర్స్ కొనుగోలు చేయడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చు. అయితే వీటిని కొనుగోలు చేసేటప్పుడు సరైన పత్రాలు, లొకేషన్స్, నిబంధనలో అన్ని సరిచూసుకోవాలి. ఎందుకంటే కొందరు మోసపూరిత అమ్మకాలు చేయవచ్చు.

## బాబు వచ్చాక
# రియల్ భూమ్
## అసలు కారణమేంటి?




ప్రభుత్వ విధానాలతోనే కొన్ని రంగాల అభివృద్ధి సాధ్యం. ప్రభుత్వం నిబంధనలు కఠిన తరం చేసినా.. అనుబంధ రంగాల విషయంలో ఆంక్షలు విధించినా.. ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. గత ఐదేళ్ల వైసిపి పాలనలో కొన్ని రంగాలు కనీస స్థాయిలో కూడా ఉనికి చాటుకోలేకపోయాయి. అందులో రియల్ ఎస్టేట్ రంగం ఒకటి. ఐదేళ్లలో పురోగతి దిశగా ముందుకు వెళ్లకపోగా.. ఎక్కడి వారు అక్కడే నిర్మాణాలను నిలిపివేశారు. కొందరు హైదరాబాద్, మరికొందరు బెంగళూరు ( Bengaluru) వంటి నగరాల వైపు వెళ్లిపోయారు. ముఖ్యంగా అమరావతి రాజధాని నిర్మాణం పడకేసిన తరువాత ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోయింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గత ఐదు సంవత్సరాల స్తబ్దత నుంచి రమేపి రికవరీ ప్రారంభమైంది. ఇది ఏపీకి ఆదాయపరంగా శుభపరిణామమే. అభివృద్ధికి ఆనవాళ్లుగా నిలుస్తుంది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడే పరిస్థితి కనిపిస్తోంది.

### పెరిగిన భూ క్రయవిక్రయాలు

కూటమి( alliance) వచ్చిన ఈ 16 నెలల కాలంలో భూ సంబంధిత లావాదేవీలు, క్రయవిక్రయాలు గణనీయంగా పెరిగాయి. 35 శాతం పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే వైసిపి హయాంలో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయింది. నిర్మాణ రంగం కుదేలు అయింది. దానిని గుణ పాఠాలుగా నేర్చుకుంది కూటమి ప్రభుత్వం. ప్రభుత్వం సంస్కరణలకు సిద్ధం అయ్యింది. అమరావతి పునరుద్ధరణ, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, కొత్త పాలసీలు ఈ వృద్ధికి ప్రధాన కారణాలు. ఇదే ఊపుతో కొనసాగితే ఏపీలో నిర్మాణరంగం మరింత బలపడినట్టే. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ మధ్య.. మూడు నెలల కాలంలో రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి మూడు వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇదే సమయంతో పోల్చితే 46% పెరుగుదల. అమరావతి చుట్టుపక్కల ప్రాంతాలైన గుంటూరు, కృష్ణా, పల్నాడు జిల్లాల్లో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. దానికి ఒకే ఒక్క కారణం అమరావతి పునర్నిర్మాణం. ప్రభుత్వ సంస్కరణలు దోహదపడ్డాయి కూడా. ఒక్క ఫిబ్రవరిలోనే 68 వేల భూ క్రయవిక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది.

### అమరావతి పునర్నిర్మాణంతో..

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం అంత ఊపొందుకోలేదు. కానీ అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ఎప్పుడైతే ప్రారంభం అయ్యాయో అప్పుడే రియల్ ఎస్టేట్ మరింత పెరగడం ప్రారంభం అయింది. భూముల ధరలు కూడా 15 నుంచి 25% ఒకేసారి పెరిగాయి. మరోవైపు నిర్మాణ రంగానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం కొన్ని నిబంధనలను సవరించింది. ప్రభుత్వ బిల్డింగ్, లేఅవుట్ అప్రూవల్ రెగ్యులేషన్లను సరళీకరించింది. ఇది రియల్ ఎస్టేట్ రంగానికి కొంత ఊతం ఇచ్చింది. అమరావతిలో ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, బిట్స్ పిలాని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ క్యాంపస్ వంటి ప్రాజెక్టులు నిర్మాణం జరుగుతుండడంతో.. సహజంగానే దాని ప్రభావం రియల్ ఎస్టేట్ రంగంపై పడింది.

### గణనీయమైన వృద్ధి..

రాష్ట్ర ఆదాయంలో రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి 10.5% వృద్ధి కనిపించింది. దీంతో సహజంగానే ఆ రంగాల్లో రాణిస్తున్న ఇతర రాష్ట్రాల వారు అమరావతి వైపు చూడడం ప్రారంభించారు. ఆపై విశాఖపట్నంలో కూడా వృద్ధి కనిపిస్తోంది. ఎందుకంటే అక్కడ భారీ స్థాయిలో ఐటీ పరిశ్రమలు, దిగ్గజ ఐటీ సంస్థలు ఏర్పాటు అవుతున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు అనేది గేమ్ చేంజర్. ఒక్కమాటలో చెప్పాలంటే అమరావతి తో పాటు విశాఖ ఇప్పుడు పెట్టుబడులకు స్వర్గధామం. ఆపై అన్ని రంగాల అభివృద్ధికి నాంది అని చెప్పవచ్చు. అయితే గత ఐదేళ్ల వైసిపి పాలనలో పడకేసిన రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకోవడం శుభ పరిణామం. 35 శాతం వృద్ధిరేటు ఆషామాషీ విషయం కాదు.

# పెట్టుబడులను ఆకర్షిస్తున్న రంగం
## నివేదికలో షాకింగ్ విషయాలు

కొన్ని రోజులుగా దేశీయ స్టాక్ మార్కెట్లో భారీ అమ్మకాలు జరుగుతుండటంతో సెన్సెక్స్, నిఫ్టీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దాదాపు అన్ని రంగాలు నష్టాల్లో ఉన్నప్పటికీ, జనవరి 28న మార్కెట్ స్వల్పంగా కోలుకుంది. అయితే, పెట్టుబడిదారులలో భయం ఇంకా కొనసాగుతోంది. ఈ సంక్షోభ సమయంలో రియల్ ఎస్టేట్ రంగంపై మాత్రం పెట్టుబడిదారుల విశ్వాసం బలంగా కొనసాగుతోందని నివేదికలు చెబుతున్నాయి.

### ధనవంతుల ఆసక్తి

ప్రముఖ రియల్ ఎస్టేట్ సలహా సంస్థ 'ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాలిటీ' మంగళవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. భారతదేశంలోని 60 శాతం కంటే ఎక్కువ మంది ధనవంతులు, అతి ధనవంతులు రాబోయే రెండు సంవత్సరాల్లో రియల్ ఎస్టేట్లో పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నారు. దేశ ఆర్థిక వృద్ధిపై కొన్ని అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, రియల్ ఎస్టేట్ను స్థిరమైన పెట్టుబడి అవకాశంగా చూస్తున్నట్లు వెల్లడైంది.

### వృద్ధిలో స్వల్పంగా తగ్గుదల

గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం రియల్ ఎస్టేట్లో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య కొద్దిగా తగ్గింది. 2023లో 71 శాతం మంది ఈ రంగంలో పెట్టుబడికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పగా, 2024లో ఈ సంఖ్య 62 శాతానికి పడిపోయింది. అయినప్పటికీ, రియల్ ఎస్టేట్ను సంపద సృష్టించే ప్రధాన మార్గంగా పరిగణిస్తున్న వారి నమ్మకం కొనసాగుతోంది.

### పెట్టుబడిదారుల ఆశలు - అధిక రాబడులు!

సర్వేలో పాల్గొన్నవారి ప్రకారం, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు 12 శాతం నుండి 18 శాతం మధ్య రాబడి ఇస్తాయని ఆశిస్తున్నారు. అయితే, 38 శాతం మంది మాత్రమే 12 శాతం కంటే తక్కువ రాబడిని అంచనా వేస్తున్నారు. మరోవైపు, 15 శాతం మందికి మించి ఉన్నవారు 18 శాతం కంటే ఎక్కువ రాబడిని ఆశిస్తున్నారు. 2025 నాటికి లగ్జరీ రియల్ ఎస్టేట్ మార్కెట్ నిరంతర వృద్ధిని నమోదు చేసుకుంటుందని ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాలిటీ ఎండీ అమిత్ గోయెల్ తెలిపారు.

### రియల్ ఎస్టేట్ భవిష్యత్తుపై ఆశాజనక దృక్పథం

స్థూల జాతీయోత్పత్తి (GDP) వృద్ధి 6శాతం నుండి 6.5 శాతం మధ్య నమోదవుతుందని అంచనా వేయడంతో, భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు భద్రతతో కూడుకున్న, అధిక రాబడులను ఇచ్చే అవకాశంగా మారుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారతీయ పెట్టుబడిదారులు తమ సంపదను విస్తరించుకునేందుకు రియల్ ఎస్టేట్ను ముఖ్యమైన మార్గంగా ఎంచుకుంటున్నారు.



# భారత్‌లో తొలిసారిగా గ్లోబల్ రియల్ ఎస్టేట్ సదస్సు

ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన ప్రతిష్ఠాత్మక ఏడవ అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్ (IREC) కు హైదరాబాద్ నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. దేశంలో ఈ అంతర్జాతీయ సదస్సు జరగడం ఇదే ప్రథమం. 2026 సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు హైటెక్స్‌లోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ గ్లోబల్ ఈవెంట్‌కు 35కు పైగా దేశాల నుంచి 1500 మందికి పైగా ప్రతినిధులు, పరిశ్రమల అధినేతలు, నిపుణులు హాజరుకానున్నారు. "ది డోర్ టు వాట్ హ్యాపెన్స్ నెక్స్ట్" (భవిష్యత్తుకు తలుపులు) అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో రాబోయే మార్పులు, మారుతున్న ఆర్థిక ప్రాధాన్యతలు, అంతర్జాతీయ పెట్టుబడులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), ప్రాప్‌టెక్, డీప్‌టెక్, సుస్థిర అభివృద్ధి వంటి కీలక అంశాలపై ఈ వేదికగా విస్తృతంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమం మూడు ప్రధాన విభాగాల కలయికగా జరగనుంది. ఇందులో అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్‌తో పాటు, ప్రాప్‌టెక్ అండ్ రియల్ ఎస్టేట్ ఇన్నోవేషన్ షోకేస్, లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పో కూడా ఉంటాయి. ఈ సందర్భంగా నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్–ఇండియా (నార్–ఇండియా) ఛైర్మన్ సుమంత్ రెడ్డి ఆరాణి మాట్లాడుతూ, "భారతదేశ డెవలపర్లు, నిపుణులు, ప్రాజెక్టులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేసే స్థాయికి చేరుకున్నాయి" అని అన్నారు. ఈ సదస్సు ఆ స్థాయిని ప్రపంచానికి చాటి చెబుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.




## హైదరాబాద్‌లో
# రియల్ గ్రోత్
### పెరగడానికి కారణం ఏంటి?

హైదరాబాద్ అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది బిర్యాని. ప్రపంచంలోని బెస్ట్ ఫుడ్‌లో హైదరాబాద్ బిర్యానీ ఒకటిగా నిలిచింది. అయితే ఇప్పుడు రియల్ ఎస్టేట్లోనూ హైదరాబాద్ దూసుకుపోతుంది. ఇక్కడ ఎన్నో రకాల భవనాలు నిలుస్తున్నాయి. కోకాపేట, హైటెక్ సిటీ వంటి ప్రాంతాలకు వెళ్తే ఇది అమెరికానా? అనే విధంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా బెంగళూరు నుంచి చాలా మంది ఐటీ నిపుణులు హైదరాబాదులో పెట్టుబడులు పెట్టేందుకు తరలివస్తున్నారు. అయితే హైదరాబాదులో రియల్ ఎస్టేట్ పెరగడానికి కారణం ఏంటి?

Reserve Bank of India housing sector ప్రకారం.. 2015 నుంచి 2020 వరకు Compound Annual Growth Rate (CAGR ) ప్రకారం.. టాప్ ప్లేస్ లోకి వెళ్ళిపోయింది. ఈ కాలంలో ఇక్కడ అనేక నిర్మాణాలు జరిగాయి. మాసివ్ బిల్డింగ్స్.. 200 ప్లస్ ఐటీ సెక్టార్స్.. ORR, Metro వంటి నిర్మాణాలతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ నెంబర్ వన్ స్థానంలోకి వెళ్లిపోయింది. అంతే కాకుండా దేశంలోని టాప్ ప్లేస్ రియల్ ఎస్టేట్ కంపెనీలు హైదరాబాదులో పలు నిర్మాణాలు చేపట్టాయి. వీటిలో ASBL కూడా ఒకటిగా నిలి చింది. దీని చైర్మన్ అభిజిత్ అనేక నిర్మాణాలు చేపడుతున్నారు.

హైదరాబాదులో రియల్ ఎస్టేట్ పెరగడానికి ప్రధాన కారణం ఐటీ సెక్టార్ పెరగడమే అని నిపుణులు అంటున్నారు. బెంగళూరు కంటే హైదరాబాదులో పెట్టుబడులు పెట్టడం వల్ల ఎంతో సేఫ్ అని భావించి చాలామంది ఐటీ నిపుణులు ఇక్కడికి తరలివస్తున్నారు. విదేశాలకు చెందిన చాలామంది హైదరాబాదులో 7.3 బిలియన్ డాల ర్ల ఇన్వెస్ట్మెంట్ చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా కొన్ని ప్రధానమైన కంపెనీలు హైదరాబాదులో వెలుస్తున్నాయి. ఇక్కడున్న వాతావరణం.. మాన్ పవర్ కారణంగా కంపెనీలు హైదరాబాద్ కు వస్తున్నాయి. దీంతో రియల్ ఎస్టేట్ గ్రోత్ కనిపిస్తుంది.

అయితే ఇటీవల రాష్ట్రంలో భూముల అమ్మకాలు, కొనుగోలు తగ్గినప్పటికీ.. హైదరాబాదులో మాత్రం భారీ ఎత్తున భవనాలు నిర్మాణాలు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా నివాసం కోసం వీటిని నిర్మించి విక్రయిస్తున్నారు. 3bhk ప్లాట్ నుంచి ప్లాట్లను విక్రయిస్తున్నారు. అయితే ఇక్కడ ఒకవైపు నిర్మాణాలు జరుగుతున్న ప్లాట్ను కొను గోలు చేసిన లాభాలు వచ్చే అవకాశం ఉందని కొందరు రియల్ ఎస్టేట్ నిపుణులు తెలుపుతున్నారు. గతంలో కంటే బహుళ అంత స్తుల భవనాల నిర్మాణాలు పెరిగిపోయాయని.. ఒకవైపు కంపెనీల కోసం.. మరోవైపు నివాస గృహాల సముదాయాలు ఎక్కువగా నిర్మాణాలు చోటు చేసుకుంటున్నాయి.

హైదరాబాదులోని దూర ప్రాంతాల్లో సౌకర్యాలు అనుకూలంగా ఉండడంతో విదేశాలకు చెందిన కంపెనీలు ఇక్కడికి తరలివస్తున్నాయి. అంతేకాకుండా కొందరు ఎన్నారైలు ఇక్కడ పెట్టుబడి పెట్టేం దుకు ఉత్సాహం చూపిస్తున్నారు. పెద్ద పెద్ద కంపెనీలు ఇక్కడే కొలువై ఉండడంతో చాలామంది ఉద్యోగం చేయడానికి ఇక్కడికి వస్తున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

**మునగాకు పొడి..**
పోషకాలతో నిండిన పొడి మునగాకులో విటమిన్ A, C, K, కాల్షియం, ఐరన్ వంటి పోషకాలు లభిస్తాయి. రోజువారీ ఆహారంలో పరిమితంగా చేర్చుకోవచ్చు.



# పదవులు రాని వారు నిరాశ చెందొద్దు

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**ముద్ర, సంగారెడ్డి:** పార్టీలో పదవులు వచ్చినా, రాకపోయినా ప్రతి కార్యకర్తను గుర్తిస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. పదవులు రాని వారు ఎలాంటి నిరాశకు గురికావద్దని, అందరూ సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్‌లో బుధవారం డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల కాంగ్రెస్ కమిటీలను ప్రకటించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్‌తో పాటు ఇతర ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల కమిటీలను సైతం




ప్రకటించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో పదవులు ఉన్నవారు, లేనివారు అనే తేడా లేకుండా ప్రతి కార్యకర్తను గుర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగి ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు.అధికారులతో వరుస సమీక్షలుసంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై త్వరలో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. నాలుగు మండలాలకు చెందిన గెలిచిన, ఓడిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో అధికారుల సమక్షంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామన్నారు.రెండు మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, అధికారులతోనూ ప్రత్యేకంగా సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సెప్టెంబర్ 30 నుంచి నాలుగు రోజుల పాటు సమావేశాలు నిర్వహించి ప్రతి కార్యకర్తతో వన్‌టువన్‌గా మాట్లాడతానని వెల్లడించారు.ఈ సమావేశాలకు పోలీసు శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను ఆహ్వానించి ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చిస్తామని జగ్గారెడ్డి తెలిపారు.

## హిజ్రాల వేధింపులపై 112కు కాల్ చేయండి

**డీజీపీ సీవీ ఆనంద్**



**ముద్ర, హైదరాబాద్:** శుభకార్యాల్లో హిజ్రాల వేధింపులకు గురైతే ప్రజలు వెంటనే 112కు ఫోన్ చేయాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.గృహ ప్రవేశ కార్యక్రమంలో హిజ్రాల నుంచి వేధింపులు ఎదురవగా పోలీసులు సకాలంలో స్పందించి రక్షించారంటూ ఓ నెటిజన్ చేసిన పోస్టుపై డీజీపీ స్పందించారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా 112 ఎమర్జెన్సీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.వేధింపులపై తక్షణమే స్పందించి బాధితులకు రక్షణ కల్పించడంతో పాటు, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు డీజీపీ తెలిపారు.

## తాతా మధు, నవీన్ రెడ్డిలను అనర్హులుగా ప్రకటించాలి

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** రాజకీయం చేయడానికి చేతకాకుండా పట్టభద్రుల స్థాయిలో ఉంటూ ఎలాంటి సంబంధం లేని తల్లిని అవమానించడం బాధాకరమని, తెలంగాణ పిసిసి వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రెనోవ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ తిప్పరాజు వెంకట నగేష్ అన్నారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్ తల్లిని గురించి అవమానకర వ్యాఖ్యలు చేయడానికి ఆయన ఖండిస్తూ బుధవారం లంగర్ హౌస్ లోని రెనోవా ఆసుపత్రిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నగేష్ మాట్లాడుతూ... తాతా మధు, నవీన్ రెడ్డిలు మామూలు ఎమ్మెల్యేల కంటే మించి పట్టభద్ర ఎమ్మెల్సీలు అని, వారి స్థాయికి తగ్గట్టుగా వారు వ్యవహరించకపోవడం బాధాకరమన్నారు. సంబంధం లేని తల్లిని బహిరంగంగా దూషించి అవమానించడం హేయమైన వ్యవహారం అని మండిపడ్డారు. ఇలాంటి నీతిలేని నాయకులను సస్పెండ్ తో సరిపెట్టకుండా, పూర్తి అనర్హులుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని 500 మంది బి ఓ పి డబ్ల్యు ఏ వైద్యుల బృందం తరపున కోరుతున్నామన్నారు.

# నియోజకవర్గాని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

**ఎమ్మెల్యే యాదయ్య**

**ముద్ర, చేవెళ్ల :** నియోజకవర్గం లో ని అన్ని మండలాల లోని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి అభివృద్ధి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవెళ్ల పురపాలిక లోని 17 వ వార్డు రంగారెడ్డి నగర్ లో రూ. 50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణపు పనులను బుధవారం ఆయన పురపాలిక చైర్ పర్సన్ సమత వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన ఖానాపూర్ శ్రీనివాస కల్యాణ మండపంలో స్మార్ట్ కార్డులు, మైనార్టీ మహిళలకు చెక్కులు అంద చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్య



మన్నారు.చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన లక్ష్య మన్నారు.ప్రతి గ్రామంలో , పురపాలిక లోని అన్ని వార్డుల్లో డ్రైనేజీ, తాగునీరు సమస్యలను దశలవారీగా పరిష్కారం చూపుతామన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి నిధులు మంజూరు చేయస్తానని తెలిపారు.. రోడ్డు పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు వెంకట్ రెడ్డి, శైలజ, ఆగి రెడ్డి, మధుసూదన్, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్, గోపాల్ రెడ్డి అధికారులు , పాల్గొన్నారు.



## అసెంబ్లీ స్పీకర్ అభ్యంతరం

**ముద్ర, హైదరాబాద్ :** సీఎం రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధ్వజమెత్తారు. ఏలేటి చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎంను అవమానపరిచి, ఏకవచనం ప్రయోగిస్తుంటే ఏం చేయాలి? అని ప్రశ్నించారు. మహేశ్వర్ రెడ్డి కూడా ఏకవచనం ప్రయోగిస్తున్నారని అన్నారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కోరారు.మహేశ్వర్ రెడ్డి సీఎంను ఏకవచనంతో మాట్లాడారు: మంత్రి సీతక్కMinister Seethakkaసీఎం రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడిన మాటలను వెనక్కు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈరోజు (బుధవారం) అసెంబ్లీలో మంత్రి సీతక్క మాట్లాడారు. పోడియంలో ప్ల కార్డులు ప్రదర్శించవద్దనే రూల్ ఉందని తెలిపారు. అయినా బీజేపీ నేతలు పోడియంలోకి వచ్చి ప్ల కార్డులు ప్రదర్శిస్తున్నారని చెప్పుకొచ్చారు.దళితులు నిరసన తెలిపిన ఎర్రవల్లి ఫాంహౌస్‌ను శుద్ధి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.కాంగ్రెస్ అగ్రనేత మల్లికార్జున ఖర్గే వెళ్లి వచ్చిన చోట బీజేపీ నేతలు కూడా అలాగే శుద్ధి చేశారని ఆగ్రహించారు. బీజేపీ, బీఆర్ఎస్ భావజాలం ఒకటేనని విమర్శించారు.

# సీఎంపై మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలు

బీఆర్ఎస్‌కు మద్దతుగా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు.

**ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఏమన్నారంటే..**

అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌ను బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తప్పుబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏమైనా ప్రత్యేక రూల్‌బుక్ పెట్టారా.? అని ప్రశ్నించారు. ఏ రూల్ ప్రకారం బీఆర్ఎస్ సభ్యులపై సస్పెన్షన్ వేటు వేశారని నిలదీశారు. బీఏసీ ప్రకారం సభ నడపాలని డిమాండ్ చేశారు. 22ఏ భూముల అంశంపై సభలో చర్చించాలని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పట్టుబట్టారు.

## సబ్జెక్ట్‌పై మాట్లాడే ఆలోచన బీజేపీకి లేదు

**మంత్రి శ్రీధర్‌బాబు**



బలహీన వర్గాల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. దళితులు నిరసన తెలిపిన ఎర్రవల్లి ఫాంహౌస్‌ను శుద్ధి చేశారని ధ్వజమెత్తారు. ఇది చాలా పెద్ద సామాజిక సమస్య అని చెప్పారు. మనం ఏ యుగంలో ఉన్నామని.. ఈ విషయంపై బీజేపీ నేతల వైఖరి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. మహేశ్వర్ రెడ్డి ఈ విషయంపై ముందు మాట్లాడాలని పట్టుబట్టారు. అసెంబ్లీలో సబ్జెక్ట్‌పై మాట్లాడే ఆలోచన బీజేపీకి లేదని అన్నారు. 22ఏ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పై కచ్చితంగా చర్చిస్తామని తెలిపారు.

## అసెంబ్లీ నడవకుండా అడ్డుపడుతున్నారు

**మంత్రి కోమటిరెడ్డి**



బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంను ఏకవచనంతో ఆయన మాట్లాడారని ధ్వజమెత్తారు. మహేశ్వర్ రెడ్డి ఆ వ్యాఖ్యలను వెంటనే వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ నడవకుండా బీజేపీ సభ్యులు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. దళితులు నిరసన తెలిపిన ఎర్రవల్లి ఫాంహౌస్‌ను శుద్ధి చేసి వారిని అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు తెలంగాణలో దళితులు ఉండవద్దని కోరుకుంటున్నారా అని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు.

## ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** కంజర్ల విజయ లక్ష్మిఫౌండేషన్‌ఆధ్వర్యంలో తాండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సిపిఆర్ ( హృదయ శ్వాస కోశ పునరుజ్జీవన చర్య ) ద్వారా అత్యవసర సమయంలో ఒక మనిషి ప్రాణాన్ని కాపాడేందుకు ఎంత ముఖ్యమో విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుండె ఆగిపోయిన వ్యక్తి ప్రాణాలను కాపాడేందుకు CPR ఎలా చేయాలి, ఎప్పుడు చేయాలి అనే విషయాలపై ప్రత్యేక నిపుణులు డాక్టర్ అనిల్ కుమార్ సమక్షంలో విద్యార్థులకు ప్రాక్టికల్‌గా శిక్షణ అందింపజేసిన కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ కంజర్ల విజయలక్ష్మి కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లి ఫాంహౌస్ శుద్ధి ఘటన.. బీఆర్ఎస్ నేతపై కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫిర్యాదు

**ముద్ర, హైదరాబాద్ :** ఎర్రవల్లి ఫాంహౌస్‌కి దళితులు వెళ్లడంతో పసుపు నీటితో బీఆర్ఎస్ నేత సంధ్యారాణి శుద్ధి చేశారని చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ధ్వజమెత్తారు. ఈ క్రమంలో సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు ఎమ్మెల్యే సత్యం, సంధ్యారాణిపై ఫిర్యాదు చేశారు. దళితులను అవమానించారని ఆమెపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం సైఫాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద ఎమ్మెల్యే సత్యం మాట్లాడారు.దళిత సమాజం ఏకతాటిపైకి వచ్చింది.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి.. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై దళిత సమాజం ఏకతాటిపైకి వచ్చిందని అన్నారు. కేసీఆర్ ఫాంహౌస్ దగ్గర మంగళవారం డప్పులతో దళితులు నిరసన వ్యక్తం చేశారని తెలిపారు. దళితులు రావడంతో ఆ ప్రాంతంలో పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆగ్రహించారు. ఈ ఘటనతో బీఆర్ఎస్ నేతలు అహంకారాన్ని చాటుకున్నారని మండిపడ్డారు. ఇలాంటి ఘటన ఎప్పుడూ చోటు చేసుకోలేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఇలాంటి ఘటన ఎప్పుడూ చోటు చేసుకోలేదని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న వారందరిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు.

## సంక్షేమం-సుపరిపాలనే బీజేపీ లక్ష్యం

**చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి**



**ముద్ర, శేరిలింగంపల్లి:** సంక్షేమం, దేశ భద్రత, సుపరిపాలన ధ్యేయంగా పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం మసీద్ బండలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో వెంకటేశ్వర నగర్ డివిజన్ అధ్యక్షులు బాలు యాదవ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు భారతీయ జనతా పార్టీ లో చేరిన సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శేరిలింగంపల్లి మాజీ శాసన సభ్యులు బిక్షపతి యాదవ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 10 ఏళ్లు పాలించిన బి.ఆర్.ఎస్, మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో అబద్ధపు హామీలు, మాయ మాటలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని, దేశంలో మరియు రాష్ట్రంలో బీజేపీకి ప్రజల మద్దతు నానాటికీ పెరుగుతోందని, నిరుపేదల సంక్షేమం, దేశ భద్రత, సుపరిపాలన ధ్యేయంగా పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనన్నారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తల రాకతో మన పార్టీ క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నామని, కొత్తగా చేరిన ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని, మనమంతా కలిసికట్టుగా రాబోయే రోజుల్లో సీఎంసీ ఎన్నికల్లో మెజారిటీ సీట్ల లో బీజేపీ పార్టీ విజయమే లక్ష్యంగా శ్రమించాలని పిలుపునిచ్చారు. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీని మరింత బలోపేతం చేయడానికి మరియు ప్రజల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. నాయకులు భూపాల్ రెడ్డి, రాజిరెడ్డి, శ్రీకాంత్ యాదవ్, నరేష్, రవికుమార్, విజయ్, నరేందర్, కరణ్, సంపత్ కుమార్, ప్రశాంత్, కవిత, వీరేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 19 ఏళ్ల కింద పట్టాలిచ్చి ఇప్పటికీ స్థలాలు కేటాయించరా?

**అదే స్థలాన్ని ఇప్పుడు మార్కెట్ యార్డుకు కేటాయించే ప్రయత్నాలు సరికాదు**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



**ముద్ర, హైదరాబాద్ :**మొయినాబాద్ మున్సిపాలిటీలోని హిమాయత్ నగర్ రెవెన్యూ గ్రామంలో గల పేదలకు 19 ఏళ్ల కింద ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇప్పటికీ వారికి స్థలాలు కేటాయించకపోవడం అన్యాయమనీ తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. స్థలాలు కేటాయించాలని కోరుతూ పట్టాదారులు 75 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంపై ''ఎక్స్'' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 19 ఏళ్ల క్రితం పేదలకు పట్టాలిచ్చిన స్థలంలో ఇప్పుడు మార్కెట్ యార్డ్ నిర్మాణానికి ప్రయత్నిస్తుండటం దారుణమన్నారు. 19 ఏళ్ల క్రితం పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చి, నేటికీ వారికి స్థలాలు కేటాయించకపోవడం బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల చేతగానితనానికి నిదర్శనమన్నారు. 75 రోజులుగా దీక్ష చేస్తున్న పేదల పోరాటాన్ని గుర్తించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ గ్రామంలో గల సర్వే నంబర్ 151లో 2007లో 290 మంది పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. వారికి ఇప్పటి వరకు స్థలాలు చూపించకపోవడంతో వారు ఇండ్లు నిర్మించుకోలేకపోయారని తెలిపారు. తమ స్థలాలు కేటాయించాలని కోరుతూ పట్టాదారులు ఉమ్మడి ఏపీ ప్రభుత్వం చుట్టూ, తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల చుట్టూ తిరిగినా వారి గోడు పట్టించుకునే వాళ్లే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు అదే సర్వే నంబర్ లోని స్థలంలో మార్కెట్ యార్డు నిర్మించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. తమకు కేటాయించిన స్థలంలో మార్కెట్ నిర్మించ వద్దని, తమకు స్థలాలు చూపిస్తే ఇండ్లు నిర్మించుకుంటామని 75 రోజులు పేదలు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వారికి తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని, పేదలకు ఇండ్ల స్థలాలు చూపించే వరకు ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు.

## రేప్, పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష




**ముద్ర, శేరిలింగంపల్లి :** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అత్యాచారం, పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించిన కోర్టు. క్రైమ్ నంబర్ 642/2023, సెషన్స్ కేసు నంబర్ 313/2023లో తీర్పు వెలువడింది. రేప్, పోక్సో, ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు.నిందితుడు మీనగల వెంకుగోపాల్ అలియాస్ వేణు (42)కు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది శిక్షతో పాటు నిందితుడిపై రూ.3 వేల జరిమానా విధించిన న్యాయస్థానం.బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం అందించాలని ఆదేశాలు జారీ చేసింది.రాజేంద్రనగర్‌లోని రేప్, పోక్సో కేసుల ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టులో విచారణ జరిపి కేసును విచారించిన న్యాయమూర్తి టీ. శ్రీనివాస్ తీర్పు వెలువరించారు గచ్చిబౌలి పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు చేసి కోర్టులో అభియోగాలను నిరూపించినట్లు వెల్లడించడంతో ఉన్నతాధికారులు సిబ్బందిని అభినందిచ్చారు.

## జేఎన్టీయుహెచ్ క్యాంపస్‌లో విద్యార్థినిపై వేధింపులు

**కఠిన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు వినతి**

ముద్ర కూకట్‌పల్లి : జెఎన్‌టియుహెచ్ క్యాంపస్‌లో ఓ విద్యార్థినిపై జరిగిన వేధింపుల ఘటనపై విశ్వవిద్యాలయం పరిపాలనా విభాగం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సాధారణ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్‌కు వారు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ ఘటనలో బాధితురాలికి మద్దతుగా నిలిచిన స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరమ్ కార్యకర్తలకు రక్షణ కల్పించాలని, వారిపై విధించిన హాస్టల్ సస్పెన్షన్‌ను తక్షణమే రద్దు చేయాలని విద్యార్థులు కోరారు. అలాగే, అర్ధరాత్రి వేళల్లో హాస్టళ్లలోకి అక్రమంగా ప్రవేశించి భయాందోళనలు సృష్టించిన బయటి వ్యక్తులు, పార్ట్–టైమ్ పిహెచ్‌డి స్కాలర్లపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్యాంపస్‌లో రాజకీయ జోక్యాన్ని అరికట్టి, విద్యార్థులందరికీ సురక్షితమైన వాతావరణాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 10.09.2026
www.mudranews.in | @mudranews



## మునగాకు పొడి.. ఎలా తీసుకోవాలి?

సాధారణంగా కొద్దిమొత్తంలో మునగాకు పొడిని గోరువెచ్చని నీరు, మజ్జిగ లేదా స్మూతీలో కలిపి తీసుకుంటారు. అధికంగా తీసుకోకుండా, ప్రత్యేక ఆరోగ్య సమస్యలు లేదా మందులు ఉంటే వైద్యుడి సలహా తీసుకోవడం మంచిది.



## వేములవాడ భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తీరినట్టే

**ముద్ర, కరీంనగర్ :** దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయ రహదారి విస్తరణతో ఇక రాజమార్గం కానుంది. ఆలయం నుంచి తిప్పాపూర్ వంతెన వరకు రహదారి విస్తరించి అభివృద్ధి చేయాలనేది భక్తులు, స్థానికుల చిరకాల స్వప్నం. ఇది ఎట్టకేలకు సాకారం కానుంది. రహదారి విస్తరణతో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులతో పాటు స్థానికులకు రాకపోకలు సులువుగా జరిగేందుకు అవకాశం ఏర్పడనుంది. రాజన్న ఆలయ ప్రధాన ద్వారం నుంచి మూలవాగు వంతెన వరకు ఇళ్లు, దుకాణాలు, స్థలాలు కోల్పోయిన నిర్వాసితులకు విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో రూ.47 కోట్లను మంజూరు చేయించి పరిహారం అందించడంతో రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. దీంతోపాటు రహదారి అభివృద్ధికి మరో రూ.6.50 కోట్లు మంజూరు చేయడంతో పనులు ఊపందుకున్నాయి. ఆలయం నుంచి మూలవాగు వరకు ఈ రహదారిని 80 అడుగుల వెడల్పుతో విస్తరించి అభివృద్ధి చేసే పనులు శరవేగంగా కొనసాగుతూ చివరి దశకు చేరాయి.ప్రస్తుతం రహదారి విస్తరణ పనులు చివరి దశకు చేరుకోవడంతో భక్తులు, స్థానికుల కల త్వరలోనే సాకారం కానుంది. ఇప్పటికే రహదారికి ఇరువైపులా మురుగు కాల్వను నిర్మించి సిమెంట్ స్లాబు నిర్మించారు. గతంలో ఇరుకుగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. విస్తరణతో రహదారి సౌకర్యంగా మారనుంది.

## గడీల పాలనపై గర్జించిన ధిక్కార పతాకం చాకలి ఐలమ్మ

**ముద్ర, హైదరాబాద్ :** గడీల పాలనకు, దొరల అహంకారానికి వ్యతిరేకంగా పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అణచివేత, దమనకాండకు వ్యతిరేకంగా ఆ మహనీయురాలు ఎగరేసిన ధిక్కార పతాకం తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి (10-09-2026) సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళి తెలిపారు. దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారని సీఎం గుర్తు చేశారు. సమ్మక్క-సారక్క, చాకలి ఐలమ్మ వంటి వీర మహిళల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని ముఖ్యమంత్రి తెలిపారు. వారి ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు కూడా ఆదర్శమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

## హెచ్ఎండీఏ నియోపోలిస్, గోల్డెన్ మైల్ ఈ-వేలాల్లో ఆకర్షణీయమైన స్పందన, రికార్డు స్థాయి ఆసక్తి

**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (HMDA) సెప్టెంబర్ 9, 2026న గండిపేట్ మండలం, రంగారెడ్డి జిల్లాలోని కోకాపేట్ గ్రామ పరిధిలో ఉన్న నియోపోలిస్ లేఅవుట్ మరియు గోల్డెన్ మైల్ సైట్-1లోని విలువైన ప్లాట్లకు ఈ-వేలాలను నిర్వహించింది. ఈ వేలాలకు బిడ్డర్ల నుంచి విశేష స్పందన లభించింది. గోల్డెన్ మైల్ సైట్-1లోని 0.70 ఎకరాల ప్లాట్ కు అత్యంత భారీ స్పందన లభించింది. ఎకరాకు రూ.70 కోట్లుగా నిర్ణయించిన ప్రతిపాదిత అప్‌సెట్ ధరకు గాను, అత్యధిక బిడ్ ధర ఎకరాకు రూ.115 కోట్లుగా నమోదైంది. హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలోని వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాల్లో ఉన్న ప్లాట్లకు కొనసాగుతున్న డిమాండ్‌కు ఇది నిదర్శనంగా నిలిచింది. నియోపోలిస్ లేఅవుట్‌లోని ప్లాట్ నంబర్ 17, 4.59 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దీనికి ఒకే ఒక్క బిడ్ దాఖలైంది. ఈ బిడ్ ధర ఎకరాకు రూ.120 కోట్లుగా నమోదైంది. ఈ రెండు ప్లాట్లు కోకాపేట్‌లో వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాల్లో ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్ (ORR), ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి మరియు HITEC సిటీ వంటి ప్రధాన ప్రాంతాలకు అద్భుతమైన రవాణా అనుసంధానం కలిగి ఉన్నాయి. హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలోని అభివృద్ధి చెందిన గ్రోత్ కారిడార్‌లో వీటి స్థానం కారణంగా రియల్ ఎస్టేట్ అభివృద్ధి మరియు పెట్టుబడులకు వీటి ఆకర్షణ మరింత పెరుగుతోంది.

## వి.ఆర్. విద్యార్థి వంటి, కవులు, రచయితలు కాళోజీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలి

- **మంత్రి జూపల్లి**
- **రవీంద్రభారతిలో ఘనంగా కాళోజీ జయంతి ఉత్సవాలు**
- **ఆర్. విద్యార్థికి కాళోజీ సాహిత్య పురస్కార ప్రదానం**

**ముద్ర, హైదరాబాద్ :** కాళోజీ నారాయణరావు ప్రజల గొంతుకగా, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైనిక కవిగా, ఖండాంతర కవిగా ప్రసిద్ధి చెందిన వి.ఆర్ . విద్యార్థికి (వేలూరి రాములు) 2026 కాళోజీ నారాయణరావు సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. వి.ఆర్ . విద్యార్థిని మంత్రి జూపల్లి కృష్ణారావు హృదయపూర్వకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.కాళోజీ నారాయణరావు సాహిత్య వారసత్వాన్ని వి.ఆర్ . విద్యార్థి వంటి వారు పుణికిపుచ్చుకుని ముందుకు తీసుకెళ్లాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ ప్రజల జీవితం, బాధ, ఆశ, ఆకాంక్ష, పోరాటం, ఆత్మగౌరవం కాళోజీ రచనల్లో స్పష్టంగా ప్రతిబింబించాయని పేర్కొన్నారు. కాళోజీ రచించిన 'నా గొడవ' కేవలం ఆయన వ్యక్తిగత గొడవ కాదని మంత్రి అన్నారు. సమాజంలోని అణగారిన, బాధిత, సామాన్య ప్రజల గొడవను తన గొడవగా కాళోజీ స్వీకరించారని చెప్పారు. ప్రజల సమస్యలను తన కలంతో వినిపించిన ప్రజాకవిగా కాళోజీ చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.

**తెలంగాణ యాస.. కాళోజీ శ్వాస**

తెలంగాణ భాష, యాసపై కాళోజీకి ఉన్న ప్రగాఢ విశ్వాసం ఆయన రచనల్లో స్పష్టంగా కనిపిస్తుందని మంత్రి అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ప్రథమ మహాసభలో తెలంగాణ బతుకు, భాషపై కాళోజీ చేసిన అధ్యక్షోపన్యాసం తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్రలో సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు. ప్రజలు మాట్లాడే భాషలోనే రచనలు చేయాలని కాళోజీ బలంగా విశ్వసించారని చెప్పారు. 'అవతలి వారికి అర్థమవుతుందా?' అని ముందే ఆలోచించడం ద్వారా మనల్ని మనమే తక్కువ చేసుకోవద్దని, ఈ బానిస భావన పోవాలని కాళోజీ చెప్పిన మాటలు తెలంగాణ భాషపై ఆయనకున్న ఆత్మవిశ్వాసానికి నిదర్శనమన్నారు.తెలంగాణ యాసను, భాషను, ప్రజల పలుకుబడిని కాళోజీ సాహిత్యంలో గౌరవప్రదంగా నిలబెట్టారని జూపల్లి అన్నారు. ప్రజలు మాట్లాడే భాషే ప్రజల హృదయ భాష అని తన రచనల ద్వారా నిరూపించారని పేర్కొన్నారు. తెలంగాణ మాండలికాన్ని తక్కువగా చూసే ధోరణులకు తన కలంతో సమాధానం చెప్పి, తెలంగాణ యాస పట్ల తనకున్న ప్రగాఢ విశ్వాసాన్ని చాటుకున్నారని వెల్లడించారు. భాష కేవలం సంభాషణకు ఉపయోగించే సాధనం మాత్రమే కాదని, ఒక జాతి చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, ఆత్మగౌరవానికి ప్రతిబింబమని మంత్రి పేర్కొన్నారు. కాళోజీ అందించిన స్ఫూర్తిని కొనసాగించాలనే ఉద్దేశంతోనే ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నెల గద్దర్ , భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కానిస్టేబుల్ అభ్యర్థులకు గుడ్‌న్యూస్..

**వయోపరిమితి మరో 3 ఏళ్లు పెంపు..**




**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలో కానిస్టేబుల్, తత్సమాన పోస్టుల అభ్యర్థులకు ఊరటనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం , తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (TSLPRB) కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. పోలీస్, ఫైర్ సర్వీసెస్, జైళ్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF) విభాగాల్లోని కానిస్టేబుల్ ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితిని మరో 3 సంవత్సరాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పెంచిన 7 సంవత్సరాల వయోపరిమితికి అదనంగా ఈ 3 ఏళ్లను కలపడంతో.. మొత్తం 10 సంవత్సరాల వయోసడలింపు లభించినట్లయింది. సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ పోస్టుల మధ్య ఉన్న వయోపరిమితి వ్యత్యాసాన్ని సరిచేయాలన్న అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

తెలంగాణలో పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి కనీస వయస్సు 18 సంవత్సరాలు కాగా, ప్రభుత్వ తాజా సడలింపులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితి 34+3 మొత్తం 37 సంవత్సరాలకు చేరింది. గతంలో 7 ఏళ్ల వయో పరిమితి పెంపుతో జనరల్ అభ్యర్థులు 29 ఏళ్ల వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉండేది.. ఇప్పుడు తాజా పెంపుతో 32 ఏళ్ల వయస్సు వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక ఎస్సై ఉద్యోగాలకు గతంలో పెంచిన వయో సడలింపు కారణంగా 37 సంవత్సరాల వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. తాజాగా వీరికి ఎలాంటి పెంపు ఇవ్వలేదు.

దీనికితోడు.. సెప్టెంబర్ 9వ తేదీతో ముగియాల్సిన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ గడువును పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించిన విషయం తెలిసిందే. వయోపరిమితి పెంపు నిర్ణయంతో కొత్తగా వేలాది మంది నిరుద్యోగ యువతకు దరఖాస్తు చేసుకునే అవకాశం లభించడమే కాకుండా, సాంకేతిక ఇబ్బందులు లేకుండా ముగింపు తేదీకి ముందే దరఖాస్తులు పూర్తి చేసుకోవడానికి ఈ గడువు పొడిగింపు ఎంతో దోహదపడుతుంది. అభ్యర్థులు పెంచిన వయోపరిమితి సడలింపులను పరిశీలించి, అధికారిక వెబ్‌సైట్ ద్వారా సెప్టెంబర్ 16లోగా తమ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

## ఎస్సీలు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేస్తారా?

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్**



**ముద్ర, హైదరాబాద్:** ఎస్సీలను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ అవమాని స్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ధ్వజమెత్తారు. తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు మూడో రోజు ప్రారంభమైన వెంటనే.. ఎర్రవల్లిలో శుద్ధిపై కాంగ్రెస్ పార్టీ వాయిదా తీర్మానం ఇచ్చింది. మంత్రి లక్ష్మణ్ మాట్లా డుతూ.. ఎర్రవల్లిలో ఎస్సీలు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేస్తారా? అని ప్రశ్నించారు. శుద్ధి పేరుతో ఎస్సీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆత్మగౌరవం కోసం తెలంగాణ సాధించు కున్నాం.. రాష్ట్రం సాధించుకున్న తర్వాత కూడా ఎస్సీలపై వివక్ష కొనసాగు తోందన్నారు. శుద్ధి పేరుతో బీఆర్ఎస్ నేతలు చేసిన పనికి ఏం సమాధానం చెబుతారు? స్పీకర్ విషయంలో ఘటనపై కూడా బీఆర్ఎస్ నేతలకు పశ్చాత్తాపం లేదని మండిపడ్డారు. మరో వైపు మంత్రి అడ్లూరి ప్రసంగానికి బీఆర్ఎస్ సభ్యులు అడుగడుగునా అడ్డు తగిలారు. 'వియ్ వాంట్ జస్టిస్' నినాదాలతో హోరెత్తించారు.

## హైవేపై లారీ బోల్తా.. 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

**ముద్ర, నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి శివారులో 44వ జాతీయ రహదారిపై లారీ బోల్తా పడింది. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి భారీ లోడ్‌తో వస్తోన్న లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు క్రేన్ సాయంతో లారీని పక్కకు తీయించారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా హైవేపై దాదాపు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## ఏపీలో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం

**ముద్ర, అమరావతి:** ఉత్తర బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రానున్న మూడు రోజులు ఉత్తరాంధ్రలో పిడుగులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. శ్రీకాకుళం, పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో మోస్తరు వర్షాలు, కురిసే అవకాశం ఉంది.

# ఫుడ్ సేఫ్టీ రైడ్స్..5 లైసెన్సులు సస్పెండ్..!

**20 ఫుడ్ సంస్థల్లో అధికారుల తనిఖీలు**
**పాడైన మాంసం, కూరగాయలు గుర్తింపు**
**కల్తీ అనుమానంతో 20 శాంపిల్స్**
**5 సంస్థలపై కఠిన చర్యలు**



**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఫుడ్ సేఫ్టీ అధికారులు భారీ తనిఖీలు చేపట్టారు. తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (TG SAFE) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న నిర్వహించిన ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లో మొత్తం 20 ఫుడ్ సంస్థలను తనిఖీ చేశారు. ఇందులో రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, హాస్టళ్లు ఉన్నాయి. తనిఖీల్లో పలు చోట్ల ఆహార భద్రత, పరిశుభ్రత నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు.

**20 సంస్థల్లో తనిఖీలు**

ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 10 బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. పలు సంస్థల్లో నిల్వ చేసిన మాంసం, కూరగాయలు పాడైపోయినట్లు గుర్తించారు. కొన్ని చోట్ల బొద్దింకలు, ఈగలు, ఎలుకల సంచారం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆహార పదార్థాలను తయారు చేసే ప్రదేశాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు రిఫ్రిజిరేటర్ల నిర్వహణ కూడా సరిగా లేదని గుర్తించారు.

**కల్తీ అనుమానంతో 20 శాంపిల్స్**

ఆహార పదార్థాల్లో కల్తీ ఉన్నట్లు అనుమానించిన అధికారులు మొత్తం 20 శాంపిల్స్‌ను సేకరించారు. పురుగులు పట్టిన, పాడైపోయిన వేరుశెనగలు, పిండి, ఎండు మిరపకాయలు వంటి ముడి పదార్థాలను అక్కడికక్కడే పారవేయించారు. వెజిటేరియన్, నాన్‌వెజిటేరియన్ ఆహార పదార్థాలను సక్రమంగా వేరు చేయకపోవడం, గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగించడం వంటి ఉల్లంఘనలను కూడా గుర్తించారు.

**లైసెన్స్ లేకుండానే హాస్టల్ నిర్వహణ**

GVK New Luxury PG Men's Hostel ఎలాంటి FSSAI లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ లేకుండానే నిర్వహిస్తున్న ట్లు తనిఖీల్లో బయటపడింది. దీంతో అధికారులు ఆ హాస్టల్ ను మూసివేశారు. ఆహార పదార్థాలను నిర్వహించే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత నిబంధనలు పాటించకపోవడం, సరైన రికార్డులు నిర్వహించకపోవడం వంటి అంశాలను కూడా అధికారులు గుర్తించారు.

**ఐదు సంస్థల లైసెన్సులు సస్పెండ్**

ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఐదు సంస్థల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను TG SAFE సస్పెండ్ చేసింది. వాటిలో మణికంఠాస్ లైవ్ స్పేస్ లగ్జరీ ఉమెన్స్ హాస్టల్, శ్రీ బాలాజీ లగ్జరీ మెన్స్ పీజీ హాస్టల్, హోటల్ సితార గ్రాండ్, బేక్ మ్యాక్స్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (బ్రౌన్ బేర్ మ్యాన్యు ఫ్యాక్చరింగ్ యూనిట్), మండి కింగ్ అరేబియన్ రెస్టారెంట్ ఉన్నాయి. ఈ సంస్థలు తక్షణమే కార్యకలాపాలను నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు.

**మరికొన్ని సంస్థలకు నోటీసులు**

గుమ్మడి ఫుడ్స్, కేఎస్ బేకర్స్, లక్ష్మీ వెంకమాంబ హాస్టల్, పద్మావతి డీలక్స్ మెస్, మెహ్‌ఫిల్ రెస్టారెంట్, శ్రీ హర్ష డీలక్స్ మెస్లకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. ప్యారడైజ్ ఫుడ్ కోర్ట్, చైతన్య ఫుడ్ కోర్ట్, భూలక్ష్మి మెస్, గోదావరి మిఠాయి సంస్థలకు జరిమానాలకు సంబంధించి షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. కూక ట్‌పల్లిలో చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీలు హైదరాబాద్‌లో ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాలు, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సింగ్ నిబంధనలను కఠినంగా అమలు చేయడంలో భాగంగా జరిగాయి. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లలో ఇలాంటి తనిఖీలను అధికారులు కొనసాగిస్తున్నారు.

# నవాబుపేట గ్రామపంచాయతీకి వైకుంఠ రథం విరాళం

*** మానవతా దృక్పథంతో 2.25లక్షల రథాన్ని అందజేసిన కాంతాల రాధా వెంకటరెడ్డి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు**
*** దాతలకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించిన సర్పంచ్ గుళ్ళ రజిత రాజు**

**ముద్ర చిగురుమామిడి:** మండలంలోని నవాబుపేట గ్రామపంచాయతీకి కాంతాల రాధా వెంకటరెడ్డి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మానవతా దృక్పథంతో సమకూర్చిన వైకుంఠ రథాన్ని బుధవారం గ్రామస్తుల సమక్షంలో అధికారికంగా అందజేశారు.సుమారు 2లక్షల 25వేల రూపాయల విలువైన ఈ రథాన్ని సొసైటీ సభ్యులు గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గుళ్ల రజిత రాజుకు, పాలకవర్గ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గుళ్ల రజిత రాజు మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేద కుటుంబాల్లో ఎవరైనా మరణించినప్పుడు అంత్యక్రియల నిర్వహణకు, భౌతిక కాయాన్ని తరలించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి క్లిష్ట సమయంలో ఈ వైకుంఠ రథం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.తమ గ్రామంపై ప్రేమాభిమానాలతో ఇంత ఖరీదైన రథాన్ని విరాళంగా ఇచ్చిన కాంతాల రాధా వెంకటరెడ్డి వెల్ఫేర్ సొసైటీ సభ్యులకు గ్రామపం చాయతీ తరపున, గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వారి దాతృత్వం సమాజంలో ఇతరులకు ఎంతో ఆదర్శదాయకమని కొనియాడారు.విరాళం అందించిన సొసైటీ సభ్యులు మాట్లాడుతూ పుట్టిన ఊరికి, గ్రామానికి తమ వంతు సేవ చేయాలనే సత్సంకల్పంతోనే ఈ చిన్న సహాయం అందించామని తెలిపారు. భవిష్యత్తులోనూ నవాబుపేట గ్రామ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.అనంతరం గ్రామానికి ఇంతటి మహత్తర సేవ చేసిన దాతల కుటుంబాన్ని, సొసైటీ సభ్యులను సర్పంచ్ గుళ్ల రజిత రాజు,గ్రామ పెద్దలు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరిం చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి సంపత్, సొసైటీ సభ్యులు కాంతాల రాజేందర్ రెడ్డి,కాంతాల రామకృష్ణారెడ్డి,కాంతాల శ్రీనివాస్ రెడ్డి, కాంతాల రఘువందన్ రెడ్డి, కాంతల గౌతమ్ రెడ్డి,కాంతాల రవీందర్ రెడ్డి, కాంతాల సురేందర్ రెడ్డి, కాంతల ప్రదీప్ రెడ్డి,వార్డు సభ్యులు బోయిని వేణు, పిల్లి తిరుపతి,కోడాపర్తి శ్రీనివాస్,పాలమాకుల ఆగయ్య,గ్రామ పెద్దలు,యువకులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 10.09.2026
www.mudranews.in | @mudranews



**మునగాకు పొడి..**
*రక్తంలో చక్కెరపై ప్రభావం* మునగాకు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో కొంత సహాయపడ వచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే మధుమేహ మందులకు ప్రత్యామ్నాయం కాదు.



# ప్రజాకవి కాళోజీకి నివాళి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** :యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి (తెలంగాణ భాషా దినోత్సవం) వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర గ్రంథాలయంలో ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ ఉర్ రహమాన్ చిస్తీ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోత్నక్ ప్రమోద్ పాల్గొన్నారు. శ్రీలక్ష్మి నరసింహ స్వామి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్స్ తోటకూరి రామకృష్ణ, కనక బాలరాజు, ఎండి అత్తరు ఫరీన్, డాక్టర్ జగనాథ్, సుధా, కిష్టయ్య, సిద్ది రాములు, లెక్చరర్లు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జాగృతి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ సింగన బోయిన మల్లేశం ఆధ్వర్యంలో పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటేష్, ఇస్తారి, సుధా కిషోరీ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

**తెలంగాణ భాషకు గౌరవ ప్రతీక కాళోజి**

**ముద్ర, మోత్కూర్:** బడి పలుకుల భాష కాదు పలుకుబడుల భాష కావాలని ప్రజల భాషకు గౌరవాన్ని తీసుకొచ్చిన ప్రజాకవి ధిక్కార స్వరం కాళోజి నారాయణరావు అని ప్రజా భారతి సాహిత్య సంస్థ పూర్వ అధ్యక్షుడు ప్రముఖ కవి దేవినేని అరవింద రాయుడు అన్నారు. బుధవారం మోత్కూర్ లో ప్రజాభారతి సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని జరిగిన తెలంగాణ భాషా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర వలస పాలకుల ఏలుబడిలో తెలంగాణ భాష అపహాస్యం అవుతున్న సందర్భంలో తన వాడి వేడి ధిక్కార స్వరంతో తెలంగాణ భాష గొప్పతనాన్ని తెలియజేసి ప్రజల్లో తెలంగాణ భాషా చైతన్యాన్ని తీసుకువచ్చిన మహనీయుడని కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు బోళ్ల హనుమంతు మాట్లాడుతూ అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి అని అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడని చాటి చెప్పిన ధైర్యశాలి అన్నపు రాశులు ఒకచోట ఆకలి మంటలు ఒకచోట అంటూ పెట్టుబడిదారీ విధానాన్ని ఎండగట్టిన సంస్కరణవాది కాళోజీ అని అన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి బయ్యని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూర్వ ప్రధాన కార్యదర్శి కవి తొగిటి మనోహరా చారి కోశాధికారి వారాల యాదగిరి, గాదె వెంకటేశ్వర్లు ,కలిమెల నర్సయ్య, సజ్జనం మనోహర్, యాదగిరి, బాబు చారి తదితరులు పాలొన్నారు.

**కాళోజీ అడుగుజాడల్లో నడవాలి**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబర్ 9** : తెలంగాణ వైతాళికుడు, ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి (తెలంగాణ భాషా దినోత్సవం) వేడుకలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి శిక్షణా సహాయ కలెక్టర్ పారస్ కుమార్ పూల









మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పారస్ కుమార్ మాట్లాడుతూ సమాజం లోని అన్యాయాలను, అక్రమాలను తన కలం బలం ద్వారా ఎండగట్టిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజాచైతన్యమే ఊపిరిగా జీవించిన కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని, ఆయన చూపిన బాటలో, అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొని కాళోజీ నారాయణరావు సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు.

**ముద్ర, సూర్యాపేట:** తెలంగాణ ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సామాజిక చైతన్యం కోసం తన కలంతో నిరంతరం పోరాడిన ప్రజాకవి కాళోజీ జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారు కాళోజీ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..."కాళోజీ నారాయణరావు గారు తెలంగాణ ప్రజల గొంతుకగా నిలిచిన మహోన్నత వ్యక్తి. తన సాహిత్యం, రచనలు, ఆలోచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిఎస్పీ లు ప్రసన్న కుమార్, నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, ఆర్ఐ ప్రవీణ్ కుమార్, ఆర్ఎస్ఐ లు సాయిరాం, అశోక్, పోలీసు సంఘం అధ్యక్షులు రమేష్, సెక్రెటరీ కిరణ్, సిబ్బంది ఉన్నారు.

**ముద్ర, దేవరకొండ:**పురపాలక సంఘం, దేవరకొండ నందు మునిసిపల్ ఛైర్మన్ శ్రీమతి పున్న శైలజ గారి చేతుల మీదుగా పూలమాల వేసి జయంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో మునిసిపల్ కమీషనర్ రామదుర్గా రెడ్డి, కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారులు మరియు నాయకులు మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాచలం విలీన గ్రామాలను తిరిగి తెలంగాణలో చేర్చాలి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 9 :** రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన యటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య కోరారు. భద్రాచలానికి వచ్చిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదు గ్రామాలను ఏపీలో కలపడం వల్ల భద్రాచలం పట్టణంలో చెత్త డంపింగ్, శ్మశాన వాటికలు, విద్యా సంస్థల ఏర్పాటుకు తీవ్ర స్థల కొరత ఏర్పడిందన్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన సుమారు 900 ఎకరాల భూమి ఏపీ పరిధిలోకి వెళ్లడంతో ఆక్రమణలకు గురవుతోందని, అభివృద్ధి పనులు నిలిచిపోయాయని వివరించారు. భద్రాచల ప్రజల, రామాలయ ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆ గ్రామాలను భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లో పునర్విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కేసీఆర్‌పై ఎమ్మెల్యే వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఆగ్రహం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 9 :** బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్‌రావుపై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకరయ్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయని ఖమ్మం బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కేసీఆర్ మరణాన్ని కోరుతూ, ఆయనకు హాని తలపెట్టేలా ప్రేరేపించే ధోరణిలో ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం తీవ్ర అభ్యంతరకరమని ఆయనపై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నేతలు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలు సహజమే అయినా, హింసను ప్రోత్సహించేలా మాట్లాడటం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో కేసీఆర్ భద్రతను సమీక్షించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయకుమార్, మాజీ కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, దండ జ్యోతి రెడ్డి, అయ్యప్ప రెడ్డి, నాయకులు బీరెడ్డి నాగచంద్రా రెడ్డి, దేవభక్తుని కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్వేషం, విధ్వంస విధానాలతో కాంగ్రెస్ పాలన



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 9 :** విద్వేషం, విధ్వంస విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చర్చ జరగకుండా వారి దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ నేతలు తాజా రాజకీయాలకు తెరలేపి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని ఆ అసంతృప్తి, వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి మళ్లించే రాజకీయాలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలపై సమాధానం చెప్పకుండా ఎన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేసినా ప్రజలను తప్పుదోవ పట్టించలేరని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటారని మాజీ మంత్రి అజయ్ కుమార్ స్పష్టం చేశారు.

# దళితుల ఆత్మగౌరవంపై దాడి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 9 :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా దళిత వర్గాల నాయకులు ఎర్రవల్లిలో నిరసన తెలిపిన ప్రదేశాన్ని బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడంపై ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ఘటనతో బీఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక నైజం మరోసారి బహిర్గతమైందని విమర్శించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ సలహాలు, సూచనలతోనే దళిత నాయకులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కడిగారని, ఇలాంటి చర్యలు నాగరిక సమాజం సిగ్గుపడేలా ఉన్నాయని మండిపడ్డారు.దళితులు కాలుమోపిన ప్రదేశాన్ని శుద్ధి చేయడం నేరుగా దళిత జాతి ఆత్మగౌరవంపై జరిపిన దాడి అని, ఆధునిక యుగంలోనూ ఇలాంటి అంటరానితనాన్ని ప్రోత్సహించడం ఫ్యూడల్ భావజాలానికి పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కుల ముందు ఇలాంటి అహంకార పూరిత చర్యలు చెల్లవని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉన్న దళిత బిడ్డపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, నిరసన తెలిపిన స్థలాన్ని శుద్ధి చేయడం బీఆర్ఎస్ నాయకుల గర్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నాయకులు తమ వైఖరిని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# వాహనదారులు నిబంధనలు పాటించాలి




**ముద్ర, తుర్కపల్లి:** తుర్కపల్లి మండల కేంద్రంలో ఎస్సై శివకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారిపై వాహనాలను నిలిపి డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లతో పాటు హెల్మెట్ వినియోగంపై పోలీసులు పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్సై శివకృష్ణ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వంటి వాటికి దూరంగా ఉండాలని వాహనదారులకు సూచించారు.

# ఓపెన్ స్కూల్లో చేరాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** అనివార్య కారణాల చేత మధ్యలో చదువు మానేసిన యువతీ యువకులు ఓపెన్ స్కూల్లో చేరాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు ఇతర యువతీ యువకులను ఓపెన్ స్కూల్లో చేర్పించడానికి బుధవారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర కోఆర్డినేటర్ అరుంధతితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓపెన్ స్కూల్లో చేరడానికి సెప్టెంబర్ 15వ తేదీ చివరి గడువుగా ఉన్నదని ఆ లోపు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఓపెన్ స్కూల్ పోస్టర్, కరపత్రాన్ని, మాడ్యూల్ ని ఆయన విడుదల చేశారు.

# మిత్ర రత్న అవార్డు ప్రదానం



**ముద్ర, మోత్కూర్:** బుజిలాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి ఇండియన్ రెడ్ క్రాస్ డైరెక్టర్ సామాజిక సేవా కార్యకర్త చేత రాశి అంజయ్య సుమారు 20 సంవత్సరాలు నుండి బుజిలాపురం లోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అనేక సేవ కార్యక్రమాలు చేస్తూ విద్యార్థులకు అండగా నిలిచిన అంజయ్య సామాజిక సేవా కార్యక్రమాల లో భాగంగా చలి వేంద్రాలు పాఠశాలలోని విద్యార్థులకు చిల్డ్రన్స్ డే, ఉపాధ్యాయులకు గురు పూజోత్సవాలు పదవ తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో సహకారాన్ని అందిస్తూ పాఠశాలకు సహాయ సహ కారాలు అందిస్తున్నా ఆయన సేవలను గుర్తించి ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షు లు డాక్టర్ జి లక్ష్మీ నరసింహారెడ్డి ఉపాధ్యాయ మిత్రరత్న అవార్డును ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా వారికి అందజేసి సన్మానించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సూరోజు భాస్కర చారి మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న స్థానిక ఎంఈఓ సత్యనారాయణ, కౌన్సిలర్ అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొని ఘనంగా అంజయ్య సేవలను గుర్తించి అభినందించారు.

# స్నేహితురాలి భర్తకు చికిత్స కోసం ఆర్థిక సాయం



**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ విశ్వభారతి ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1999-2000 పదవ తరగతి బ్యాచ్ పూర్వపు విద్యార్థులు తమ తోటి విద్యార్థిని పట్టూరి సువర్ణ భర్త భద్రయ్య గుండెకు సంబంధించిన సమస్యతో హైద్రాబాద్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న సువర్ణ స్నేహితులు తమ వంతుగా రూ.26500 సేకరించి అందుబాటులో ఉన్న స్నేహితులు విశ్వ భారతి స్కూల్ భాగస్వామి పురుగుల రాములు చేతుల మీదుగా సువర్ణ కు అందజేశారు. ఈ సందర్భంగా పురుగుల రాములు మాట్లాడుతూ స్నేహితులు కష్ట కాలంలో ఉన్నపుడు ఇలా స్నేహితులంతా ముందుకు రావడం అభినందనీయమను అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కోమటి మత్స్యగిరి, నోముల రమేష్ నేత, కట్ట ఇందిరా జ్యోతి, సంద చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవాలి



**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో డిఫెన్స్ కన్స్యూమర్ రైట్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు గుమిడేల్లి పరశు రాములు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్షర స్కూల్ భవనం నిబంధనలకు విరుద్ధంగా ఫస్ట్ ఫ్లోర్ ను అక్రమంగా నిర్మించి ఎలాంటి పర్మిషన్ లేకుండా నడుపుతున్నారు.ఇది తెలంగాణ మున్సిపల్ చట్టం - 2019, హెచ్ఎండిఏ బిల్డింగ్ రూల్స్ కు విరుద్ధం అని పర్మిషన్ లేని భవనంలో స్కూల్ నడపడం వల్ల చిన్న పిల్లల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. అగ్ని ప్రమాదాలు, భవనం కూలిపోయే ప్రమాదం ఉందనీ ఆ స్కూల్ బిల్డింగ్ ప్లాన్ ను పరిశీలించి, అక్రమ ఫస్ట్ ఫ్లోర్ కు నోటీసు జారీ చేసి, సీజ్ చేయగలరనీపిల్లల భద్రత దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆలకుంట్ల రాజు,కురెళ్ళ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల మహిళా సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. శిరోమణి మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం నిత్యావసరాలైన నూనె, పప్పులు, పంచదార, ఉల్లిగడ్డల ధరలను విపరీతంగా పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారాలు మోపిందని విమర్శించారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ ఛార్జీలతో అల్లాడుతున్న ప్రజలను ఈ ధరల పెంపు మరింత కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను చౌకగా అందించాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గించకపోతే భవిష్యత్తులో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు టి. ఝాన్సీ, సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ, నాయకులు గోగినపల్లి సరోజిని, పరిమళ, అనసూయ, సుగుణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన కాలువ పనులకు శ్రీకారం



**ముద్ర, తుర్కపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య చొరవతో కొండాపూర్, తిర్మలాపూర్, వీరారెడ్డిపల్లి గ్రామాలకు సాగునీరు అందించే పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. కొండాపూర్ మీదుగా బస్వాపూర్ రిజర్వాయర్‌కు వెళ్తున్న ప్రధాన కాలువ నుంచి మూడు గ్రామాలకు నీటిని మళ్లించే పనులను స్థానిక సర్పంచ్ లావణ్య జహంగీర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామాలకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి సౌకర్యం అందుబాటులోకి రావడంతో వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, రైతులకు సాగునీటి సమస్యలు కొంతవరకు పరిష్కారం కానున్నాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ధనావత్ శంకర్‌నాయక్, కొండాపూర్ సర్పంచ్, తుర్కపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చాడ భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు.అలాగే ఆత్మ డైరెక్టర్ సముద్రాల వెంకటేశం, జహంగీర్, సహకార సంఘం డైరెక్టర్లు వంగ నారాయణరెడ్డి, శ్రీను, హన్మంత్‌నాయక్, కొండాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోనె దుర్వాసులు, తిర్మలాపూర్ సర్పంచ్ దొనికేన రేణుక వెంకటేశం, తిర్మలాపూర్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు చాడ కరుణాకర్‌రెడ్డి, రామగోని వెంకటేష్‌గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమాల సమన్వయకర్త రత్నాల చంద్రశేఖర్, కొండాపూర్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎంఎల్సీ పదవిని రద్దు చేయాలి



**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా లో తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను హేళన చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన బి ఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు , నవీన్ రెడ్డి ల పదవి కాలాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రతిపక్ష నాయకుడు కెసిఅర్ అహంకార, నియంతృత్వ పోకడలను నిరసిస్తూ బుధవారం కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ పేలపూడి వెంకన్న , డీసీసీ కార్యదర్శి కూరెళ్ల శ్రీరాములు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం జయశ్రీ, జిల్లా కాంగ్రెస్ నాయకులు బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి, గడ్డం సోమనర్సయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు మందుల సురేష్, మాజీ సర్పంచ్ మర్రిపెల్లి యాదయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు సూరరం నవీన్, పల్లెర్ల భాస్కర్,చిరుమర్తి యాదయ్య, మండల కాంగ్రెస్ నాయకులు లెంకల వేణు,ఎడ్ల శ్రీను, పురుగుల నర్సిహ్మ, ఎడ్ల భగవంత్ పాల్గొన్నారు

# నేటి విద్యార్థులే దేశానికి నిజమైన సంపద

**ముద్ర, మోత్కూర్:** మోత్కూరు మండలం లోని పాటిమట్ల జెడ్పీహెచ్ఎస్‌లో నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను సన్మా నించారు. స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కానుగంటి శ్రీశైలం మాట్లాడుతూ నేటి విద్యార్థులే తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి ఉన్నత స్థానం చేరుకున్న తర్వాత వారి బాగోగులను చూసుకునే బాధ్యత విద్యార్థులదేనని వారే దేశానికి నిజమైన సంపదని అన్నారు. సర్పంచ్ బండ రమా విజయ రెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిర్యాల దామోదర్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దర్శనం వెంకన్న, అంగన్వాడీ టీచర్ పుష్పలత ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాటిమట్ల ఉపాధ్యాయ ఉపాధ్యాయిని బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

గురువారం 10.09.2026

www.mudranews.in | @mudranews



## రోగనిరోధక శక్తికి మునగాకు పొడి

మునగాకులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు ఉండటంతో శరీర రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తుంది.



# కాళోజి సేవలు చిరస్మరణీయం





**ముద్ర ప్రతినిధి, మెదక్:** తెలంగాణ యాసలో సామాజిక రచనలు చేసి ప్రజలను చైతన్య పర్చిన ప్రజాకవి, సామాజిక ఉద్యమ కారుడు కాళోజీ నారాయణరావు అని అధనపు కలెక్టర్ మెంచు నగేష్ అన్నారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా కలెక్టరేట్ లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా కాళోజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందిస్తుందని తెలిపారు.డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, సంక్షేమ అధికారులు ఉపేందర్, సింధు, కలెక్టరేట్ కార్యాలయ సూపరిండెంట్ తదితరులు పాల్గొన్నారు.

**కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి**

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సాహిత్య, సామాజిక సేవలను స్మరించుకున్నారు. పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది అంటూ కాళోజీ తన కవిత్వం ద్వారా ప్రతి ఒక్కరిలో దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించారని అన్నారు. ప్రజల సమస్యలను నిర్భయంగా తన రచనల్లో ప్రతిబింబిస్తూ ప్రజాకవిగా ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం కాళోజీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. సైబర్ క్రైమ్ డియస్పి సుభాష్ చంద్ర బోస్, సీఐలు జార్జ్, సందీప్ రెడ్డి, ఆర్ఐ రామ కృష్ణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

**పొడ్చన్ పల్లి పాఠశాలలో..**

.పాపన్నపేట మండలం పొడ్చన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం,ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించారు. ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మాధవ రెడ్డి మాట్లాడుతూ అన్యభాషల నేర్చి ఆంధ్రంబు రాదనుచు సకిలించు ఆంధ్రుడా అని తెలుగు వారిని చైతన్యపరిచిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ యాస, భాషల గొప్పతనాన్ని, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి విద్యార్థులపైనే ఉందన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు డాక్టర్ బి. దేవయ్య మాట్లాడుతూ...బడి పలుకుల భాష కాదు, పలుకు బడుల బాష కావాలని ప్రకటించిన తెలంగాణ ప్రజా కవి కాళోజి అని అన్నారు. 'నా గొడవ' పేరుతో సమకాలీన సామాజిక సమస్యలపైన ముక్కు సూటిగా స్పందించి ఆనాటి పాలకులపై అక్షరాయుధాలను సంధించాడని చెప్పారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వంపై అవగాహన కల్పించారు. కాళోజీ కవితలు వినిపించారు. ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్ గౌడ్, కె.కిషన్, కె.శివశంకర్, కె.మహిపాల్, కంప్యూటర్ ఆపరేటర్ పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలి







**కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో గణేష్ నవరాత్రి ఉత్సవ ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంక్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ ఎస్పీ లక్ష్మి నారాయణలతో కలిసి సమీక్షించారు. ముందుగా శాంతి సమావేశం కమిటీ సభ్యులు తమ సూచనలు, సలహాలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ.. 14న వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, భక్తులకు, ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఏర్పాట్లు చేయాలని, వినాయకుల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాపులు సిద్ధం చేసుకోవాలని, అవసరమైన రూట్లలో రోడ్ల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని తెలిపారు. వినాయక చవితి నిమజ్జనానికి చెరువుల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఫస్ట్ ఎయిడ్ కిట్లను మెడికల్ ఆఫీసర్, సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసిఅందుబాటులో ఉంచాలన్నారు. వినాయక నిమజ్జన స్థలాల వద్ద భారీ క్రేన్లను ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనం సాయంత్రం వేళ జరుగుతున్నందున నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటినుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వినాయక నిమజ్జన సమయంలో విద్యుత్ తీగల సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తూ ప్రతి చెరువు దగ్గర విద్యుత్ సిబ్బందిని అందుబాటులో ఉండేలాచూడాలన్నారు. విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో మండపాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలన్నారు.గణేష్ నవరాత్రులు మొదలుకొని నిమర్జనం పూర్తయ్యే వరకు అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండపాలలో అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలి అనే వాటి మీద అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా పండగ వాతావరణంలో జరుపుకునేందుకు సహాయ సహకారాలు అందివ్వాలని తెలిపారు. జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ విగ్రహాన్ని పెట్టుకునే ప్రతి ఒక్కరు ఆన్లైన్లో కమిటీ సభ్యులు, గణేష్ వివరాలను నమోదు చేయాలని అన్నారు. ఆన్లైన్లో నమోదు చేసిన వివరాలు బట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేయడం జరుగుతుందన్నారు. రాత్రి సమయంలో మండపాల వద్ద ముగ్గురు వాలంటీర్లు ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేష్ మండపాలు రోడ్లను బ్లాక్ చేసి పెట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయి కాబట్టి రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు, గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ లలగపరిరక్షణ, కాలుష్య నివారణపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. మట్టి గణ పతుల వినియోగంతో నీటి కాలుష్యం తగ్గడంతో పాటు ప్రకృతి సమతుల్యతను కాపాడవచ్చని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. డీఆర్వో జయమ్మ, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, సంఘం సభ్యులు, ఉత్సవ కమిటీల సభ్యులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దారులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా నిర్వహించుకోవాలి

**దేవరకొండ సబ్ కలెక్టర్**

**ముద్ర , దేవరకొండ:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవరకొండ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శాంతి సమావేశం సబ్ కలెక్టర్ కరోలిన్ బుధవారం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు సంఘాల నాయకులు మండల నిర్వాహకులు హాజరయ్యారు. సబ్ కలెక్టర్ కరోలిన్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో శాంతిభద్రతలకు విఘాతం కలవకుండా అన్ని మతాలను గౌరవిస్తూ వినాయక చవితిని జరుపుకోవాలని సూచించారు. వివిధ డిపార్ట్మెంట్లకు సంబంధించిన అధికారులతో ఏర్పాట్ల పర్యవేక్షణను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యం గా పీస్ కమిటీలో రాజకీయ నాయకులు మాట్లాడుతూ నిమజ్జనం వద్ద విద్యుత్తు లైట్లను ఏర్పాటు చేయాలని తెలిపారు రోడ్ల వెంట వేలాడే విద్యుత్ వైర్లను తొలగించాలని రోడ్లకు ఇరువైపులా మట్టిని పోయాలని సూచించారు. వివిధ మతాలకు సంబంధించిన నాయకులు మాట్లాడుతూ పండగలను ఏ మతం వారైనా ఇతర మతాలను గౌరవిస్తూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ డిఎస్పి శ్రీనివాసరావు సిఐ వెంకట్ రెడ్డి తహసిల్దార్ సంజీవ్ కుమార్, అధికారులు, పార్టీల నాయకులు మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలపై టీజీఈజేఏసీ తో ప్రభుత్వం కీలక చర్చలు



**ముద్ర, హైదరాబాద్:** ఉద్యోగుల సంకల్ప సభ ప్రభావంతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు ఆహ్వానించింది. ఈ సందర్భంగా సచివాలయంలో టీజీఈజేఏసీ ప్రతినిధులతో ఉద్యోగుల ప్రధాన సమస్యలపై ప్రభుత్వం విస్తృతంగా చర్చించింది. పలు అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు టీజీఈజేఏసీ నాయకులు తెలిపారు.ప్రధానంగా పీఆర్సీ నివేదిక, సీపీఎస్ రద్దు, డీఏ బకాయిలు, పెండింగ్ బిల్లులు, హెల్త్ కార్డుల అమలు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ నెల 18వ తేదీలోపు పీఆర్సీ నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు నాయకులు వెల్లడించారు. పీఆర్సీ కమిటీ నివేదిక సమర్పించాలని సీఎస్ ఆదేశాలు జారీ చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు.సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణపై సమగ్రంగా అధ్యయనం చేసేందుకు కమిటీ ఏర్పాటు అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించింది. పెండింగ్‌లో ఉన్న డీఏపై ఈ నెల 18న జరిగే సమావేశంలో స్పష్టత ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను త్వరగా విడుదల చేయాలని టీజీఈజేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఉద్యోగులకు పూర్తిస్థాయిలో హెల్త్ కార్డుల అమలు, ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం–టీజీఈజేఏసీ మధ్య చర్చల ప్రక్రియను కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు.ఇటీవల నిర్వహించిన ఉద్యోగుల సంకల్ప సభలో ఉద్యోగులు ఐక్యంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలోనే ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించిందని టీజీఈజేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన వరకు ఐక్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో టీజీఈజేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ బోట్నాల రాజశేఖర్, రాములు, పాక రమేష్, దర్శన్‌గౌడ్, కుమారస్వామి, ఉపేందర్, భిక్షమ్‌గౌడ్, రాబర్ట్ బ్రూస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలను బలోపేతం చేయాలి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ (ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యాశాస్త్రం) కార్యక్రమాల పురోగతిపై కలెక్టర్ ప్రతిమా సింగ్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాలు బలోపేతం చేయాలని సూచించారు. జిల్లా, మండల విద్యాధికారులు, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి విద్యార్థుల అభ్యాస స్థాయిలు, ప్రధాన అభ్యాస లోపాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.విద్యార్థుల్లో ప్రాథమిక చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను మెరుగుపరచేందుకు నాణ్యమైన బోధన, నిరంతర మూల్యాంకనాలు, రెమెడియల్ టీచింగ్, మెంటర్ల క్రమబద్ధమైన పాఠశాల సందర్శనలు, కాంపిటీంట్ స్కూల్స్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి విద్యార్థి అభ్యాస పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యబద్ధమైన కార్యాచరణ చేపట్టాలని సూచించారు. జిల్లాను రాష్ట్రంలోని మొదటి స్థానంలో నిలపాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ లక్ష్య సాధన కోసం జిల్లా విద్యాశాఖ, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఎస్ఎఫ్ బృందం సమన్వయంతో పనిచేసి 2026–27 విద్యా సంవత్సరంలో జిల్లాను విద్యా రంగంలో ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి రాజు, ఏఎంఓ సుదర్శన్ మూర్తి, సీఎంఓ రాజు, ఏఎస్ఓ నవీన్ కుమార్, డిఎస్ఓ రాజిరెడ్డి, ఏసీజీఈ కరుణాకర్, ఎఫ్ఏఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మన అంగన్వాడి -మన బాధ్యత

**తొమ్మిదవ జాతీయ పోషణ మాసం పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మహిళా శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 9వ జాతీయ పోషణ మాసం పోస్టర్ ను ఆవిష్కరించారు.మనం అంగన్వాడి –మన బాధ్యత అని.... ఈనెల 9 నుంచి అక్టోబర్ 8 వరకు పోషణ మాసంలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మాతా, శిశు సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వాలు పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిశీలనకు 'పోషణ్ అభియాన్'ను నిర్వహిస్తున్నామన్నారు. వారు తీసుకోవాల్సిన ఆహారంపై సూచనలివ్వడం, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డీఈఓ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి–65పై ప్రత్యేక ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

**138 కిలోల కల్తీ/అననుకూల ఆహారం ధ్వంసం..**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ సేఫ్ కమిషనర్ ఆదేశాల మేరకు నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో జాతీయ రహదారి–65 వెంబడి ధాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లపై బుధవారం ప్రత్యేక ఆహార పరిరక్షణ తనిఖీలు నిర్వహించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో, జిల్లా డిజిగ్నేటెడ్ ఆఫీసర్ పి. స్వాతి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎన్. శివ శంకర్ రెడ్డి తనిఖీలు చేపట్టారు.తుప్రాన్‌పేట్‌లోని చా చా ఫ్యామిలీ ధాబాలో తనిఖీల సందర్భంగా నిబంధనల ఉల్లంఘనలు తీవ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రిఫ్రిజిరేటర్‌లో గడువు ముగిసిన వినియోగ తేదీతో కుళ్లిన మాంసాన్ని నిల్వ చేయడం, సరైన ఉష్ణోగ్రత నియంత్రణ లేకపోవడం, రిఫ్రిజిరేటర్లలో ఫంగస్, దుమ్ము, మురికి పేరుకుపోవడం, సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగం, ఆహార పదార్థాలను నేలపై నేరుగా నిల్వ చేయడం, ఆహార నిర్వహణ సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం వంటి లోపాలు బయటపడ్డాయి. దీంతో ధాబాను సీజ్ చేసి, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌ను సస్పెండ్ చేశారు. ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేసి,శాంపిళ్లను పరీక్ష నిమిత్తం సేకరించారు. 62వేల రూపాయల విలువగల 83 కిలోల కుళ్లిన మాంసం, ఇతర అననుకూల ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు.మాల్కాపూర్‌లోని సంగం హోటల్‌లో కూడా పలు ఉల్లంఘనలు గుర్తించారు. ఫంగస్ సోకిన కూరగాయలు, సరైన ఉష్ణోగ్రత నియంత్రణ లేని రిఫ్రిజిరేటర్లు, వినియోగ తేదీలు లేకుండా నిల్వ చేసిన మాంసం, సాస్‌లు, గ్రేవీలు, అల్లం తదితర పదార్థాలు గుర్తించారు. పెస్ట్ కంట్రోల్, ఆహార నిర్వహణ సిబ్బంది మెడికల్ ఫిట్‌నెస్‌కు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేవని గుర్తించారు. హోటల్‌కు ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేసి, ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్, నాలుగు సర్వైలెన్స్ శాంపిళ్లను సేకరించారు. 10 కిలోల మాంసం ఉత్పత్తులు, 5 కిలోల కూరగాయలు, 30 కిలోల గ్రేవీలు, 10 కిలోల టీ పొడి.. మొత్తం 55 కిలోల అనుమానాస్ కదా మానవ ఆహారానికి మానవ ఆహార వినియోగానికి పనికిరాని ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు.రెండు హోటలలో, మొత్తం 138 కిలోల మానవహారం వినియోగానికి పనికిరాని అటువంటి ఆహార పదార్థాలను ప్రజల ఆరోగ్యరీత్యా అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఆహార పరిరక్షణ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని అధికారులు స్పష్టం చేశారు. తనిఖీలు ఇలాగే కొనసాగుతాయని, వ్యాపారులు బాధ్యతాయుతంగా , ఆహార పరిరక్షణ ప్రమాణాలను పాటించాల్సిందిగా, లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని ఉమ్మడి నల్గొండ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి హెచ్చరించారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555